


# విజయభాను

40 Years of Excellence విజయభాను వార్షికోత్సవ శుభాకాంక్షలు

విశాఖపట్నం, బుధవారం 09-08-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 40 సంచిక : 328 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## 500 నోటుపై పెద్ద దుమారం

- కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ ఆరోపణ
- ఈ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి?
- కేంద్ర మంత్రి నఖ్వి నిలదీత
- సైజు మార్పు సాధారణమే
- ప్రభుత్వం ఆదేశించలేదు
- ఆర్థిక శాఖ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఆర్బీఐ కొత్తగా ప్రవేశపెట్టిన రూ.500 నోటు రాజ్య సభలో పెద్ద దుమారమే రేపింది. ఈ నోటు శతాబ్దంలో పెద్ద స్కామ్ అని కాంగ్రెస్ ఆరోపించింది. వేర్వేరు సైజులు, డిజైన్లు ఉన్న రెండు నోట్లను కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ సభలో చూపించారు. మేం కూడా పాలించాం.. గానీ ఇలా ఒకటి ప్రభుత్వం కోసం, ఒకటి పార్టీ కోసం రెండు రకాలు నోట్లను ఎప్పుడూ ముద్రించలేదు. 500, 2000 నోట్లు రెండూ రెండు రకాలుగా ఉన్నాయి అని గులామ్ నబీ ఆజాద్ ఆరోపించారు. అయితే జీరో హవర్‌లో ఎన్నో ముఖ్యమైన అంశాలపై చర్చించాల్సి ఉన్నా.. కాంగ్రెస్ మాత్రం కరెన్సీ నోట్లపై బాధ్యతారాహిత్య ప్రకటన చేస్తున్నదని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ విమర్శించారు. దీంతో కాంగ్రెస్ నేతలంతా సభలో ఆందోళన చేశారు. ఈ తరువాయి 2లో

## కన్నతల్లిని, మాతృదేశాన్ని మరువరాదు


### ఉపరాష్ట్రపతి వెంకయ్యకు ఆత్మీయ అభినందన సభ



నెల్లూరు: ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన ఎం. వెంకయ్యనాయుడు మంగళవారం తన స్వగ్రామమైన నెల్లూరు జిల్లాలోని చవటపాలెంలో పర్యటించారు. వెంకయ్య ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భంగా చవటపాలెం గ్రామస్థులు ఆయనకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కన్నతల్లిని, మాతృదేశాన్ని మరిచినవాడు మనిషేకాదని అన్నారు. కులాలు, మతాలు మనం సృష్టించుకున్నవే అని తెలిపారు. చవటపాలెం గ్రామానికి రైల్వేలైన్‌తో పాటు పలు అభివృద్ధి పనులు మంజూరు చేయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆత్మీయ అభినందన సభలో తమ సొంతూరులోని ఆత్మీయులను పేరుపేరున పలకరించిన వెంకయ్య అనంతరం శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాగా, సోమవారం సాయంత్రం నెల్లూరు చేరుకున్న వెంకయ్య నాయుడికి ఘనస్వాగతం లభించింది. తిరుమల నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకున్న వెంకయ్యకు మంత్రులు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ రామకృష్ణలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆత్మీయ సభ జరిగిన వీఆర్‌పీ గ్రౌండ్ వరకు భారీ ప్రదర్శనగా వెళ్లారు.

ఈ సమయంలో దారి పొడవునా విద్యార్థులు, ప్రజలు వెంకయ్యకు ఘనస్వాగతం పలికారు. ఆయనపై పూల వర్షం కురిపించారు. వీఆర్‌పీ గ్రౌండ్‌లో జరిగిన ఆత్మీయ సభలో వెంకయ్యను ఘనంగా సన్మానించారు.

## నంద్యాల ఉపఎన్నికల యుద్ధం



- జగన్ ఉన్మాదికాక మరేమిటి?
- రెచ్చగొట్టే వ్యాఖ్యలకు స్పందించవద్దు
- వైకాపా నేతల వ్యాఖ్యలే వారిని ఓడిస్తాయి
- తెదేపా కార్యకర్తలు సంయమనం పాటించాలి
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి: నంద్యాల ఉప ఎన్నికల్లో తెదేపా విజయం తథ్యమని ఏపీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ నేతలతో తరువాయి 2లో

- చంద్రబాబు అవహేళన చేశారు
- ఓడిపోతామనే భయంతోనే విమర్శలు
- ఇప్పుడు అభివృద్ధి పేరుతో రాజకీయం
- అభివృద్ధి అడిగితే నిధులు లేవంటున్నారు
- వైకాపా అధికార ప్రతినిధి అంబటి రాంబాబు

నంద్యాల: ఉప ఎన్నికలో ఓడిపోతామనే భయంతోనే సీఎం చంద్రబాబు అభివృద్ధి మంత్రం జపిస్తున్నారని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు. మంగళవారం ఆయన తరువాయి 2లో




## గుజరాత్ ఎన్నికలకు ముగిసిన పోలింగ్

అహ్మదాబాద్: గుజరాత్‌లోని మూడు రాజ్యసభ స్థానాలకు మంగళవారం నిర్వహించిన పోలింగ్ మధ్యాహ్నం రెండు గంటలకు ముగిసింది. గుజరాత్ అసెంబ్లీలో మొత్తం 182 మంది సభ్యులుండగా.. 176 మంది ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆ రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి బీబీ.సావిన్ తెలిపారు. మూడు స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో భాజపా నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఒకరు బరిలో నిలిచారు.

ఈ ఎన్నికల్లో భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీల విజయం ఖాయమైనట్టే. ఇటీవల కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరిన బల్వంత్ సిన్హా రాజ్‌పుత్, కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్‌కు మధ్య పోరు ఆసక్తికరంగా మారింది. విజయం సాధించాలంటే ఒక్కో అభ్యర్థికి 45 ఓట్లు అవసరం కానున్నాయి.

రాజ్యసభ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ నమ్మకం వెలిబుచ్చారు. సంఖ్యాబలం తనకే ఎక్కువగా ఉందని.. ఫలితాలు అనుకూలంగా వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

## రాహుల్‌పై రాళ్లదాడికి కారణం అదే..




న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ కాన్వాయ్‌పై గుజరాత్‌లో జరిగిన రాళ్లదాడిపై కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కావాలనే ఆయనను లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడ్డారంటూ విమర్శించడంతో... కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. సెక్యూరిటీ ప్రోటోకాల్స్ వదలిపెట్టి వ్యక్తిగత కార్యదర్శిని అనుసరించడం వల్లే ఈ ఘటన జరిగినట్టు పేర్కొన్నారు. భద్రతా లోపాల కారణంగా రాళ్లదాడి జరిగిందన్న కాంగ్రెస్ విమర్శలను లోక్‌సభ వేదికగా తరువాయి 2లో

## కులచిచ్చు రేపొద్దు

### నేతలు తమ ఆలోచనా విధానం మార్చుకోవాలి

### జనసేన అధినేత పవన్ కల్యాణ్



విజయవాడః జనసేన అధినేత, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రెస్ మీట్‌లో కులాలపై చాలా ఘాటుగా స్పందించారు. కులపిచ్చి నేతలపై విరుచుకుపడ్డారు. ఈ దేశ స్వాతంత్ర్యానికి కారకులు మహాత్మాగాంధీ వైశ్య కులస్తుడని, గిరిజనులతో కలిసి పోరాడిన అల్లూరి సీతారామరాజు క్షత్రియ కులస్తుడని, ఇక అంబేద్కర్‌ను అయితే ఓ సామాజిక వర్గానికి నేత అని చాలా మంది రాజకీయనేతలు మాట్లాడడం చాలా దారుణమని, వారు తమ ఆలోచన విధానం మార్చుకోవాలని అన్నారు.

గరగపర్రు సంఘటనే తీసుకుంటే నేతలలోని ఈ రకమైన ఆలోచనలు వెల్లువెత్తుతున్నప్పుడు.. సామాన్యులు ఎంత? అమాయకులైన వారి ఆలోచనలను కలుషితం చేస్తోంది రాజకీయ నేతలేనని పవన్ దుయ్య తరువాయి 2లో

## అయోధ్య కేసులో గొప్ప మలుపు


### యోగా తప్పనిసరి పిటిషన్ కొట్టివేత



న్యూఢిల్లీ : అయోధ్య రామ జన్మభూమి కేసుపై సుప్రీంకోర్టు త్వరలో విచారణ జరపబోతోంది. ఈ నేపథ్యంలో షియా, సున్నీ వక్ఫ్ బోర్డుల మధ్య విభేదాలు వచ్చినట్లు సమాచారం. తరువాయి 2లో




## టేకిట్ ఈజీ




అయ్యగారి బట్టల మచ్చలు, మరకలు పోగొట్టడం నా వల్ల కాదు... చిన్న చిన్న స్కాములు చెయ్యమని చెప్పండి అమ్మగారు !!

## సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించాలి

### ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా

అరకుః ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ గౌరవ ఇఎస్ఎల్ నరసింహన్, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అరకు పర్యటన సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆర్.పి. సిసోడియా పరిశీలించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో గల అన్ని ఐటిడిఎలకు చెందిన గిరిజన కళాకారులతో మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే తరువాయి 2లో



# నర్సీపట్నం రోడ్డు విస్తరణకు రంగం సిద్ధం

**- రూ.120కోట్లు నష్టపరిహారానికి, రూ.20కోట్లతో 100 అడుగుల రహదారి - మంత్రి అయ్యన్నపాత్రుడు**


విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : నర్సీపట్నం రోడ్డు విస్తరణకు రంగం సిద్ధం అయిందని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో ఆయన స్వగృహంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.140కోట్లు మంజూరు అయిందన్నారు. దీనిలో రూ.120కోట్లు నష్టపరిహారానికి, రూ.20కోట్లు 100 అడుగుల రహదారి నిర్మాణానికి ఉపయోగిస్తామన్నారు. త్వరలో వీటి ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు.

17న 150 పడకల ఆసుపత్రి భవనం ప్రారంభం:

రూ. 13కోట్లతో నిర్మాణమైన నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి 150 పడకల భవనాన్ని కూడా అదే రోజు ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. తాళ్లపాలెరానర్సీపట్నం రోడ్డుకు శంకుస్థాపన చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తాళ్లపాలెం రోడ్డుకు రూ.33కోట్లు మంజూరయ్యాయని, ఇప్పటికే టెండరు ప్రక్రియ పూర్తి అయిందన్నారు. 17న శంకుస్థాపన దీని శంకుస్థాపన చేస్తామన్నారు. 18న నియోజకవర్గంలో 2,393 ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా, ఒక్కొక్క ఇంటికి రూ.1.50లక్షలు ఖర్చు చేస్తామన్నారు. మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం, బలిఘట్టం మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. నర్సీపట్నం కేడిపేట వెళ్లే రోడ్డు వెడల్పుకు, ఫారెస్ట్ ఏరియాలో రోడ్డు మరమ్మత్తులకు రూ.12కోట్లు మంజూరయ్యాయన్నారు. బలిఘట్టం నుంచి జోగుపాలెం మీదుగా కోటవురట్లకు బైపాస్ రోడ్డుకు రూ.3కోట్లు త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. నర్సీపట్నం చుట్టు పక్కల నుండి 100 అడుగుల మేరకు రింగ్ రోడ్డు ఏర్పాటు చేయనున్నామన్నారు. బాలికల కళాశాల వద్ద నర్సీపట్నం ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు రూ.2కోట్లు మంజూరు అయ్యాయని, త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు.


జగన్, రోజాపై మండిపాటు:

జగన్, రోజాలు పద్దతి మార్చుకోవాలని మంత్రి తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును చూస్తే నడిరోడ్డు మీద కాల్చిదలని జగన్ చెప్పడం అతని దుర్మార్గమైన చర్య అన్నారు. ఇలాంటి వారిని ఎలా ముఖ్యమంత్రి చేస్తారో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలన్నారు. అదే విధంగా రోజా వ్యాఖ్యలు సరికాదన్నారు. యువ మంత్రి అయిన అఖిలపై ఇటువంటి చేయడం తగదన్నారు. రోజా ఒక ఐరన్‌లెగ్, ఆమె ఎక్కడ ఉంటే అక్కడ పార్టీ ఎందుకు పని చేయదని ఆరోపించారు.


కందుల నాగరాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్లిపురంలో రైల్వే గవర్నమెంట్ హైస్కూలు విద్యార్థులకు ఉచితంగా బస్సుపాసులు పంపిణీ చేస్తున్న దృశ్యం

# వెంకయ్య చాలా సాయం చేశారు

- ఉన్న వనరులు ఉపయోగించుకుంటున్నాం
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నాం
- ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు



అమరావతి: కేంద్రమంత్రిగా వెంకయ్య నాయుడు రాష్ట్రానికి సాధ్యమైనంత సాయం చేశారని సీఎం చంద్రబాబు నాయుడు గుర్తుచేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన సీఎం.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను జాగ్రత్తగా నెట్టుకొస్తున్నామని చెప్పారు. తెలంగాణతో పోలిస్తే ఆర్థికంగా సమాన స్థాయికి వెళ్లలేక పోతున్నామన్నారు. అయినప్పటికీ ఉన్న వనరులన్నీ ఉపయోగించుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్నామని చెప్పారు. ఆగస్టు 15న పురుషోత్తపట్నం ఎత్తిపోతలను మూడు పంపులతో ప్రారంభిస్తామని చెప్పారు. ఇన్‌ఫ్రా కాంట్రాక్టు సంస్థలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందు వల్లే... దుర్గగుడి ఫ్లైవోవర్, హైవే పనుల్లో జాప్యం జరుగుతోందని వివరించారు. ఇకపోతే నియోజకవర్గాల పునర్విభజన జరిగినా.. జరగకపోయినా ఇబ్బందేమీ లేదన్నారు. పునర్విభజన లేదని కేంద్రం ఇప్పటివరకు అధికారికంగా చెప్పలేదన్న సీఎం.. ఎక్కువ సీట్లు ఉంటే రాజకీయ స్థిరత్వం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

# అవినీతి, అరాచక మార్గాలే టిడీపీ దిశానిర్దేశం

- ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తున్నారు
- దొరికితే గాలిని కూడా లీటర్లలా అమ్మేస్తారు
- వైకాపా అధికార ప్రతినిధి తమ్మినేని సీతారాం



హైదరాబాద్ : తెలుగుదేశం పార్టీకి నంద్యాల ఉప ఎన్నికలో ఓటమి భయం పట్టుకుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తమ్మినేని సీతారాం అన్నారు. అందుకే నంద్యాల ఎన్నికలో గెలుపు కోసం ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతి, అరాచకాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఆయన మంగళవారమిక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. నంద్యాలలో ఎలాగైనా గెలవాలని చంద్రబాబు ప్రజాస్వామ్య విలువలను పక్కన పెడుతున్నారని ధ్వజమెత్తారు. కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని, టీడీపీ నగదు పంపిణీకి పోలీసులు కాపలా కాస్తున్నారని తమ్మినేని ఆరోపించారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు నంద్యాలలో తిష్టవేసి పోలీస్ పహారాలో డబ్బులు, మద్యం ఏరులై పారించడం దారుణమని అన్నారు. రాత్రికి రాత్రే శిలాఫలకాలు లేకుండా టెంకాయలు కొడుతున్నారని..దేవాలయాలు, దర్గాలు, ప్రార్థనామందిరాలని చెప్పి డబ్బులు పంచుతున్నారని నిప్పులు చెరిగారు. చంద్రబాబు అన్ని వ్యవస్థల్ని భ్రష్టు పట్టించారని తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందులో చూసినా అవినీతే కనిపిస్తోందన్నారు. బాబుకు గాలిచిక్కడం లేదు గానీ లేకపోతే దాన్ని కూడా లీటర్‌ల కొద్దీ ప్యాకెట్లు కట్టి అమ్ముకునేవాడని ఎద్దేవా చేశారు.

నంద్యాల బహిరంగ సభలో చంద్రబాబుపై వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యల్లో ఏ తప్పులేదన్నారు. నంద్యాల ఉప ఎన్నిక సజావుగా సాగాలంటూ కేంద్ర బలగాలు మోహరించాలని గవర్నర్, ఈసీకి ఈ సందర్భంగా తమ్మినేని సీతారాం విజ్ఞప్తి చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరపాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రజాస్వామ్యాన్ని ఏవిధంగా నవ్వుల పాలు జేస్తున్నారో, ఎన్నికలను ఎంత అపహాస్యం చేస్తున్నారో ఇక్కడి దురాగతాల్ని మీడియా ఎండగట్టాలని విన్నవించారు.

# జాతీయ స్థాయిలో ప్రథములకు నగదు పురస్కారాలు

- వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు
- ఘనంగా స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ఫ్రెషర్స్ డే వేడుకలు



ఆంధ్రవిశ్వవిద్యాలయంః ఏయూ విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రథమ ర్యాంకులు సాధిస్తే వర్సిటీ తరపున లక్ష రూపాయలు నగదు పురస్కారాన్ని అందిస్తామని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు ప్రకటించారు. మంగళవారం ఉదయం ఏయూ స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ యూజీసీ నెట్, సిఎస్ఆర్ వంటి పరీక్షల్లో ప్రతిభ చూసి ప్రథమ ర్యాంక్ సాధించే విద్యార్థికి నగదు ప్రోత్సాహకం అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు తమ, తల్లిదండ్రుల ఆకాంక్షలను సాకారం చేసే దిశగా ఎదగాలన్నారు. విశ్వవిద్యాలయానికి బ్రాండ్ అంబాసిడర్లుగా విద్యార్థులు నిలుస్తారన్నారు. స్నేహపూర్వకంగా మెలగుతూ మంచి వాతావరణాన్ని విభాగంలో పెంపొందించాలని సూచించారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.ఇ బాబు మాట్లాడుతూ అభ్యసనాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. పాఠ్యపుస్తకాలను చదవాలని, ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి నిరంతరం కృషిచేయాలన్నారు. విశ్రాంత ఆచార్యులు కె.వి రమణ మాట్లాడుతూ కాలాన్ని వృధా కానివ్వకుండా కష్టించి పనిచేయాలన్నారు. సమాజ ఆకాంక్షలను సైతం నెరవేర్చే దిశగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు.

ఆచార్య జి.ఎస్ మూర్తి మాట్లాడుతూ జ్ఞానాన్ని సముపార్జించడానికి విద్యార్థుల తమ కాలాన్ని, శక్తిని వెచ్చించాలన్నారు. ఉన్నత లక్ష్యాలను స్థిరపరచుకుని వాటిని సాధించే దిశగా పనిచేయాలని సూచించారు. జాతీయ చైనత్యం కలిగి ఉండాలన్నారు.

ఆచార్య పి.వేణి మాట్లాడుతూ నిబద్దతతో తరగతులకు హాజరవ్వాలన్నారు.

స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ సంచాలకులు ఆచార్య ఆర్.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉన్నత ఉపాధి, పరిశోధన అవకాశాలు అందింపుచ్చుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆచార్య టి.శివరావు, విభాగాధిపతులు బసవయ్య, పి.శ్యామల, వి.సిద్దయ్య, ఆచార్య శైలజ, డాక్టర్ సత్యనారాయణ, క్రిష్టోఫర్ తదితరులు ప్రసంగించారు.వివిధ అంశాలలో విజేతలుగా నిలచిన విద్యార్థులకు వీసీ బహుమతులను ప్రధానం చేశారు.

# తూర్పు నౌకాదళాన్ని సందర్శించిన బంగ్లాదేశ్ నావికా అధికారులు



విశాఖపట్నంః బంగ్లాదేశ్ నావికాదళానికి చెందిన అధికార బృందం మూడు రోజుల పర్యటన సందర్భంగా తూర్పు నావికా దళాన్ని సందర్శించింది. బంగ్లాదేశ్ నేవీకు చెందిన నావికా సిబ్బంది (మెటీరియల్) అసిస్టెంట్ చీఫ్ రేర్ అడ్మిరల్ ఎం. షాహీన్ ఇక్బాల్ నాయకత్వంలో ఐదుగురు సభ్యుల బృందాన్ని విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్ రేర్ అడ్మిరల్ నారాయన ప్రసాద్‌ను కలిసి పలు విషయాలపై చర్చించారు.

నారాయణ్ ప్రసాద్ బంగ్లదేశ్ బృందానికి నేవల్ డాక్‌యార్డ్ వద్ద పని తీరును వివరించారు. ఈ బృందం హిందూస్తాన్ షిప్‌యార్డ్‌ను కూడా సందర్శించనుంది.

## మొదటి పేజీ తరువాయి

## రాహుల్‌పై రాళ్లదాడికి కారణం అదే..

తిప్పికొట్టారు. రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు జరిగాయి. చాలామంది సెక్యూరిటీ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని రాహుల్ తిరస్కరించారు. పదే పదే వాహనాలు మారుస్తూ వెళ్లారు. భద్రతా సిబ్బంది సూచనలు అనుసరించి ఉంటే ఇలా జరిగేదికాదు అని పేర్కొన్నారు.

ఆయనకు ఎస్పీజీ భద్రత ఉన్నప్పటికీ పక్కన బెట్టడానికి కారణమేంటని రాజ్‌నాథ్ సింగ్ నిలదీశారు. గత రెండేళ్లలో రాహుల్ గాంధీ 72 రోజుల పాటు ఆరుసార్లు విదేశీ యాత్రలకు వెళ్లారు. కాని ఎస్పీజీ సిబ్బందిని మాత్రం తీసుకెళ్లలేదు. ఆయన ఎక్కడికెళ్లారో మాకు తెలియాలి.. ఎస్పీజీ సిబ్బందిని ఎందుకు తిరస్కరిస్తున్నారో చెప్పాలి.. అని ప్రశ్నించారు. గుజరాత్ ప్రభుత్వం ఈ ఘటనపై వేగంగా స్పందించిందని... ఇప్పటికే ఓ వ్యక్తిని అరెస్టు చేసిందని ప్రశంసించారు.

కాగా కాంగ్రెస్ సీనియర్ నేత ఖర్గే మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో భద్రతా దళాలపై రాళ్లు విసురుతున్నది తీవ్రవాదులేనని కేంద్ర చెబుతోందనీ... మరి గుజరాత్ ఏ తీవ్రవాదులు రాళ్లు విసురుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. మిగతా కాంగ్రెస్ ఎంపీలంతా ఆయనతో గొంతు కలపడం.. పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో లోక్‌సభను కొద్దిసేపు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ సుమిత్రా మహాజన్ పేర్కొన్నారు.

## అయోధ్య కేసులో గొప్ప మలుపు

షియా వక్ఫ్ బోర్డు రామాలయానికి మద్దతుగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. వివాదాస్పద స్థలంలో రామాలయాన్ని నిర్మించుకోవచ్చునని చెప్తున్నట్లు తెలుస్తోంది. మశీదును ముస్లింలు నివసించే ప్రాంతానికి తరలించాలని కోరుతున్నట్లు సమాచారం. ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ కేసుపై విచారణ జరుగుతుంది.

యోగా తప్పనిసరి పిటిషన్ కొట్టివేత

దేశంలోని పాఠశాలల్లో యోగా సాధనను తప్పనిసరి చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులు రోజు యోగా సాధన చేసేందుకు వీలుగా జాతీయ యోగా విధానాన్ని అమలుపరిచే దిశగా ఆదేశాలు జారీచేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ ఎంబీ లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. అలాంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది.

పాఠశాలల్లో ఏం బోధించాలో చెప్పడం మా పని కాదు. ఈ అంశంపై మేమెలా ఆదేశించగలం అంటూ పిటిషనర్‌ను ప్రశ్నించింది. పాఠశాలల్లో ఏం బోధించాలనే అంశం ప్రాథమిక హక్కు కాదని పేర్కొంది.

## చంద్రబాబు అవహేళన చేశారు

విలేకరులతో మాట్లాడుతూ... మూడేళ్ల పాలనలో చంద్రబాబు నంద్యాల ముఖం కూడా చూడలేదన్నారు. నంద్యాల అభివృద్ధిని కోరుకునేది శిల్పా మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మాత్రమేనని పేర్కొన్నారు. రోడ్లు వెడల్పు చేయమని గతంలో శిల్పా మోహన్ రెడ్డి కోరితే నిధులు ఎక్కడున్నాయని చంద్రబాబు అవహేళన చేశారని గుర్తు చేశారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌ను మీడియా ముందు ప్రదర్శించారు.

ఇప్పుడు ఉప ఎన్నిక రాగానే అభివృద్ధి పేరుతో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. నంద్యాలలో ఇన్నేళ్లు రోడ్డు విస్తరణ ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే శిల్పా మోహన్‌రెడ్డిపై కుట్రలు చేశారని ఆరోపించారు. 2014లో శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్‌పై ఏ లాయర్ సంతకం చేశారో, ఇప్పుడు అదే న్యాయవాది సంతకం చేశారని వెల్లడించారు. గెలవమనే భయంతో నామినేషన్‌పై నానా యాగీ చేశారని విమర్శించారు. ఉప ఎన్నికలో ఓటు ద్వారా చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలను నంద్యాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జగన్ ఉన్మాదికాక మరేమిటి?

మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరువ చేసే బాధ్యత పార్టీ నేతలదేనని పేర్కొన్నారు. 2019 ఎన్నికలకు ప్రతి ఒక్కరూ ఇప్పట్నుంచే సమాయత్తం కావాలని సూచించారు. ప్రతిపక్ష నేతలు చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలకు కార్యకర్తలెవరూ స్పందించవద్దని.. వారి సంగతి ప్రజలే చూసుకుంటారన్నారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఉన్మాదిలా ప్రవర్తిస్తుంటే.. అధికారంలోకి వస్తే ఎలా ఉంటాడో ప్రజలే బేరీజు వేసుకోవాలన్నారు. సీఎంను చెప్పుతో కొట్టాలి, నడిరోడ్డుపై కాల్చి చంపాలి, కలెక్టర్‌ను జైలుకు పంపిస్తా, పోలీస్ కమిషనర్ పించన్ ఆపేస్తా అంటూ వ్యాఖ్యలు చేయడం ఉన్మాదం కాక మరేమిటి? అని చంద్రబాబు ప్రశ్నించారు. జగన్ ఉన్మాది అనడానికి ఆయన వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. 2019 ఎన్నికల్లో వైకాపా 30 సీట్ల కంటే ఎక్కువ గెలిచేది లేదని సర్వేలన్నీ చెబుతున్నాయని తెలిపారు. వైకాపా నేతల వ్యాఖ్యలే వారిని ఓడిస్తాయని.. తెదేపా కార్యకర్తలంతా సంయమనం పాటించాలని చంద్రబాబు సూచించారు.

## 500 నోటుపై పెద్ద దుమారం

సందర్భంగా కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ మాట్లాడారు. ప్రభుత్వం ఎందుకు నోట్లను రద్దు చేసిందో ఇప్పుడు తెలిసింది. ఆర్బీఐ రెండు వేర్వేరు సైజులు, డిజైన్లలో ఆర్బీఐ నోట్లను ముద్రిస్తున్నది అని సిబల్ విమర్శించారు. త ృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఓబ్రైన్ కూడా కాంగ్రెస్ లేవనెత్తిన అంశాన్ని సమర్థించారు. ఇది చాలా సీరియస్ అంశమని ఓబ్రైన్ అన్నారు. అయితే ఈ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ నిలదీశారు. అయితే నోట్లలో స్వల్ప డిజైన్, సైజు మార్పులు సాధారణమేనని, ప్రభుత్వం ఆదేశించలేదని ఆర్థిక శాఖ స్పష్టంచేసింది.

## కులచిచ్చు రేపొద్దు

బట్టారు. ఇటీవల భీమవరంలో తన కటౌట్లను కొందరు కావాలనే ధ్వంసం చేశారని, ఆ సమయంలో తాను అక్కడికి వెళ్లి ఉంటే ఆ అంశం ఖచ్చితంగా కులం మలుపు తిరిగేదని, అలా తిప్పడానికి, రెచ్చగొట్టడానికే కొందరు ఇలా చేశారని పవన్ విశ్లేషించారు. రాజకీయ నేతలు తమ ఆలోచనలలో సంస్కారయుతమైన ఆధునిక ధోరణి అలవర్చుకోకపోతే ఇలాంటి సంఘటనలే జరుగుతాయని, మనసులో నుంచి కులం అనే ఫీలింగ్‌ను తుడిచిపెట్టాలని పవన్ పిలుపు ఇచ్చారు.

## సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించాలి

విధంగా కళారూపాలను ప్రదర్శించాలన్నారు. వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ప్రిన్సిపాల్ సెక్రటరీతో పాటు గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ పద్మ, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జాయింట్ కలెక్టర్ జి. సృజన, పిఓ ఐటిడిఎ రవి పట్టం శెట్టి, రూరల్ ఎస్.పి. రాహుల్ దేవ్ శర్మ, ఇతర జిల్లా అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



గ్రేటర్ విశాఖపట్నం దొండపర్తి శ్రీ సూర్య జంక్షన్ వద్ద పరదేశమ్మ కోవెల దగ్గర మంగళవారం15, 31, 44వ వార్డులలో ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగింది. దీనికి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు క్రీడల్లో రాణించాలని హితవు పలికారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లిని కలిసిన విద్యార్థినీ విద్యార్థులు తమకు క్రీడా పరికరాలు కొనుగోలు చేసి ఇప్పించవలసిందిగా అర్థించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే వాసుపల్లి వెంటనే వారికి క్రికెట్ కిట్లు, ఇతర క్రీడాపరికరాలు కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సత్యనారాయణ రెడ్డి, జోనల్ కమిషనర్-4 రమణమూర్తి, శంకరరావు, పి.వి. రమణ, కోటి రెడ్డి, శివప్రసాద్, వెంకట రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, గంట్యాడ శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

# వర్సిటీ విభాగాలను సందర్శించిన వీసీ

## పటిష్టంగా తరగతులు నిర్వహించాలి



విభాగాలను పరిశీలిస్తున్న వీసీ నాగేశ్వర రావు

విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని పలు విభాగాలను వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఉదయం సోషల్ సైన్సెస్ విభాగం లోని సోషల్ వర్క్, సోషియాలజీ, సంగీతం, జర్నలిజం విభాగాలను తనిఖీ చేశారు. తరగతులు జరుగుతున్న విధానం, విద్యార్థుల, సిబ్బంది హాజరు పరిశీలించారు. పటిష్టంగా తరగతుల నిర్వహణ జరగాలని సూచించారు. తరచూ తరగతులకు హాజరుకాని విద్యార్థుల పేర్లు తొలగించాలని విభాగాధిపతులకు సూచించారు.

# ఇరవై ఏళ్ళ తర్వాత 'అపూర్వ కలియిక'

## -పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న లంకెలపాలెం జడ్పీ పాఠశాల విద్యార్థులు



గాజువాక: ఇరవై ఏళ్ళ క్రితం లంకెల పాలెం జడ్పీ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు స్నేహితుల దినోత్సవం నాడు కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఎక్కెడెక్కడో వివిధ రంగాలలో స్థిరపడిన, పాత స్నేహితులను కలవాలనే తపన మదిలో మెదలడంతో ఒకరిద్వారా ఒకరు తెలుసుకొని గతంలో చదువుకున్న పాఠశాల వద్దే కలుసుకున్నారు. తము చదువుకున్న గదులను చూసి ఆనందించారు. పాఠాలను నేర్పిన ఉపాధ్యాయులను కలసి ఆనందాన్ని పంచుకున్నారు. 1996-97 బ్యాచ్ చెందిన సుమారు 300మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సహపంక్తి భోజనాలు చేసారు. తమకు పాఠాలను నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆర్థిక ఇబ్బందిల్లో వున్న తోటి స్నేహితులకు ఆర్థిక సహాయాన్ని చేసారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థి సంఘం ప్రతి నిది సర్వసిద్ది సన్యాసిరాజు మాట్లాడుతూ చిన్ననాటి జ్ఞాపకా లను మరవ లేమని, వాటిని నెమరు వేసుకున్నప్పుడూ ఆనందపు భాష్పాలు వస్తాయని అన్నారు. మనం ఎంత ఎత్తులో ఉన్న తోటి వారికి సహాయ సహకారాలను అందించి సమాజ సేవలో పాలు పంచుకోవాలని, అటువంటి మంచి కార్య క్రమాలను నిర్వహించేందుకు మేమందరం ఒక ప్రణాళికను రూపాం దిస్తు న్నామని తెలి పారు. క్రమం తప్పకుండా ఒకరి నోకరు కలుసుకొని సహాయ సహకారాలను అందించుకునేందుకు పూర్వ విద్యార్థులు కృషి చేయాలని కోరారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి తప్పకుండా హాజరైనందుకు తోటి విద్యార్థులకు అభినందనలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కింతాడ ఈశ్వరరావు, పూడి బాబురావు, పిల్లా కృష్ణవేణి, ఆకం రెడ్డి రాజ్యలక్ష్మి, బలిరెడ్డి కిరణ్‌చందు తదితరులు పాల్గొన్నారు.

# 10న రాయితీ రుణాలకు అభ్యర్థుల ఎంపిక

కొయ్యూరు: నిరుద్యోగుల జీవనోపాధికి ఐటిడిఏ మంజూరు చేస్తున్న రాయితీ రుణాలకు ఈ నెల 10న అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఎంపిడిఓ ఇమ్మానుయేలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసు కున్న ఎస్టీ, ఎస్సీ, బిసి, కాపు కులాలకు చెందిన అభ్యర్థులు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

# జింక్ గేటు వద్దకు చిరువ్యాపారస్తులను తరలిస్తాం

గాజువాక: కణితి రోడ్డుకు ఇరువైపుల రహదారిని ఆక్రమించి వ్యాపారాలను నిర్వహిస్తున్న చిరువ్యాపారస్తులను జింక్ గేటువద్దకు తరలించేందుకు చర్యలు చేపడుతున్నామని జోన్-5 జెడ్సీ సోమన్నారాయణ తెలిపారు. మంగళవారం కణితి రోడ్డు లోని మార్కెట్‌ను పరిశీలించారు. రహదారికి ఇరువైపుల వున్న వ్యాపారస్తులతో ఆయన మాట్లాడుతూ త్వరలోనే చిరు వ్యాపారస్తులను జింక్ గేటువద్దకు తరలించే కార్యక్రమం మొదలౌతుందని అన్నారు. ట్రాఫిక్ సమస్యల కారణంగా ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దీనికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లాన్ అధికారి ఎసిపి నాయుడు, శానిటేషన్ అధికారులు గాజువాక ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మీజిల్స్, రుబెల్లా టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్‌పీపీ చేకూరి



అచ్యుతాపురం: 9 నెలల నుండి 15 సంవత్సరాల పిల్లలందరికీ తట్టు, రుబెల్లా వంటి వ్యాదులు రాకుండా ఉండటానికి మీజిల్స్, రుబెల్లా టీకాలు వేయించాలని ఎమ్‌పిపి చేకూరి శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం మండలంలోని మీజిల్స్, రుబెల్లా టీకా కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలన్నిటినీ వైద్య సిబ్బంది ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు.

ఈ మీజిల్స్, రుబెల్లా టీకా కార్యక్రమం శతశాతం పూర్తి అయ్యేలా అందరూ సహకరించాలన్నారు. వైద్యాధికారి భీమారావు మాట్లాడుతూ మీజిల్స్, రుబెల్లా టీకా తీసుకోవడం వలన తట్టు వ్యాది రాకుండా ఉంటుందని అలాగే జన్యుపరమైన వ్యాదులు రాకుండా ఉంటాయన్నారు. ఈ కార్య క్రమాన్ని మండలంలోని నాలుగు పాఠశాలల్లో ప్రారంభించామని అలాగే ప్రాదమిక ఆరోగ్య కేంద్రంలో కూడా ఈ టీకాల కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిడిఓ పి.బల రాముడు, జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనువాసరావు, పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ చైర్మెన్ దేశంశెట్టి యల్లయ్యనాయుడు, ఎమ్ఇఓ దేవ రాయల్, సామాజిక ఆరోగ్యాదికారి పి.సాంబమూర్తి, ఆయా గ్రామ సర్పంచ్‌లు, కెజిబివి ఎస్ఓ భారతి, వైద్య సిబ్బంది గ్రేస్ మార్గేట్, లండా అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

# పందుల ఏరివేత షురూ

యలమంచిలి రూరల్ : మున్సిపాలిటీలో ప్రజాజీవనానికి ఆటంకంగా మారిన పందుల పట్టివేత కార్యక్రమాన్ని మున్సిపల్ శాఖ సిబ్బంది ప్రారంభించారు. ఇటీవల మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ పందుల పెంపకందారులకు వార్నింగ్ ఇచ్చిన నేపథ్యంలో వారు కమిషనర్ మాటను భేఖాతరు చేశారు.

దీంతో ఆగ్రహించిన కమిషనర్ తక్షణ చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించడంతో పందులను పట్టివేసే కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తపేటలో పందులను పట్టుకునే క్రమంలో పందుల పెంపకందార్లకు సమయం ఇవ్వడం జరిగిందని తెలిపారు. పందుల పట్టివేతతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


# 'రడీమేడ్ గార్మెంట్స్'లో ఉచిత శిక్షణ

విశాఖపట్నం: బివికె కళాశాలలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న డిడియు కౌశల్ కేంద్రం నిర్వహిస్తున్న ఉచిత 'రడీమేడ్ గార్మెంట్స్' శిక్షణ, శిక్షణానంతరం కేంద్ర ప్రభుత్వం అందించే డిప్లమాలో ఉచిత ప్రవేశాల కోసం, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తుల్ని కళాశాల కరస్పాండెంట్ ప్రొ.కందర్ప విశ్వనాధ్ ఆహ్వానిస్తున్నారు. ఈ ఉచిత శిక్షణా కాలం ఒక సంవత్సరం, శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఉద్యోగ భరోసాతో పాటు డిప్లమో ఇవ్వబడుతుంది. ఈ శిక్షణ పారిశ్రామిక భాగస్వాముల సహకారంతో, నేటి పరిశ్రమ వాతావరణానికి అనువుగా, ప్రమాణాలకు అనుగుణంగా ఇవ్వబడుతుంది.

శిక్షణ అనంతరం వస్త్రరంగంలో 'ఎంట్రిప్రెన్యువర్'గా స్థిరపడాలనుకునేవాదనెరికి, ఎంట్రిప్రెన్యువర్‌గా ఎలా ఎదగాలో మార్గదర్శనం చేస్తుందీ కౌశల్ కేంద్రమని విశ్వనాధ్ తెలియజేశారు.

ఈ శిక్షణ నిపుణుల సారధ్యంలో 'యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్' వారి పర్యవేక్షణలో సాగుతుంది. 'రడీమేడ్ గార్మెంట్స్' డిప్లమోలో చేరటానికి అభ్యర్థులు ఇంటర్ పాసై ఉండాలి. అర్హత, ఆసక్తి కలవారు బివికె కళాశాల ప్రాంగణంలో కేంద్రం కార్యాలయంలో నేరుగా సంప్రదించవచ్చును. ఫోన్‌లో సంప్రదించాలనుకునేవారు 9491906340, 9441256256 నంబర్లను సంప్రదించగలరు.

# ఆధ్యాత్మిక సేవకు ఘన సత్కారం



ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

విశాఖపట్నం : వైఖానస యూత్ ఫోరమ్ ఆధ్వర్యంలో 1 టౌన్ ఏరియా ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి దరి శ్రీ సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో విఖనస మహాముని జయంతి సందర్భంగా గత 25 సం॥లకు పైగా విశేషంగా నిస్వార్థమైన ఆధ్యాత్మిక సేవలను అందిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించినాము. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఖానస యూత్ పారం గౌరవాధ్యక్షులు బృందావనం దేశకాచార్యులు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్‌ను దుశ్శాలువా మరియు పూలమాల వేసి ఘనంగా సత్కరించి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసినాము. అనంతరం బృందావనం దేశికాచార్యులు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ చేస్తున్న ఆధ్యాత్మిక సేవలను కొనియాడారు. తదుపరి సత్కార గ్రహీత ఎం.వి.రాజశేఖర్ తనకు జరిగిన ఘనసత్కారానికి గాను వైకానస యూత్ ఫోరమ్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర వైఖానస సంఘం ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసమూర్తి, వైఖానస యూత్ ఫోరం అధ్యక్షులు పి.రంగనాథా చార్యులు, ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణాచార్యులు, కోశాధికారి ఎం.శ్రీదర్, వైకానస యూత్ ఫోరం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# కా॥ సూర్యకు ఘన నివాళి



విశాఖపట్నం : సిపిఎం జిల్లా నాయకులు కామ్రేడ్ ఎం.సూర్యనారాయణ 3వ వర్ధంతి సభ సిపిఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాధం అధ్యక్షతన జరిగింది. ఆయన చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. నరసింగరావు, సిపియం జిల్లా, నగర కార్యదర్శులు కె.లోకనాధం, బి.గంగారావులు పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యునిగా, సిఐటియు జిల్లా అధ్యక్షునిగా పనిచేసిన సూర్యనారాయణ జీవిత విశేషాలను కె.లోకనాధంగారు వివరించడమైంది. ఈ వర్ధంతి సభలో సిహెచ్.నరసింగరావుగారు మాట్లాడుతూ అతిచిన్నవయస్సులోనే సిపిఎం పార్టీ ఉద్యమంలోకి వచ్చిన సూర్యనారాయణ లేని లోటు తీర్చలేనిదన్నారు.పేద దళిత కుటుం బంలో జన్మించి, సంక్షేమ హాస్టల్‌లోనే విద్యా భ్యాసం చేసి, విద్యార్థి దశ నుండే ప్రజానేతగా ఎదిగాడన్నారు. పేదల పక్షాన నిలిచిన నేత. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారు. ఆయన కుల వివక్షపోరాట సంఘం ఉద్యమ ప్రారంభంలో జిల్లాలో దళిత పేటల్లో ఉన్న వివక్ష రూపాలపై తిరుగుబాటు చేశారు. పార్టీ పూర్తికాలం కార్య కర్తగా వచ్చిన అనంతరం ఏజెన్సీలో బాధ్యతలు అప్పగించినా ఎన్నో కష్టాలకోర్చి దాదాపు 15 ఏళ్లు అక్కడ ఉద్యమ నిర్మాణంలో కీలకభూమిక వహించారన్నారు. ఏజెన్సీ బాక్సైట్, చైనాక్లే, 1/70 పోరాటాలు నిర్వహించడంలో క్రియాశీలకమైన పాత్ర నిర్వహించారన్నారు.

సిపియం పార్టీని ఏజెన్సీ ప్రాంతంలో గ్రామ గ్రామానికి తీసు కెళ్ళడంలో ఎంతో శ్రమించారన్నారు. సమస్యలను అధ్య యనం చేయడం, వాటిని తీసుకోవడం లోనూ, పోరాటాలు నిర్వహిం చడంలో సూర్య మంచి నేర్పరన్నారు.

బి.గంగారావు మాట్లాడుతూ భౌతికంగా సూర్యా నారాయణ మరణించినా ఆయనలోని ఉన్న అనేక అంశాలను మనం పాటించడం ద్వారానే అయనకు సరైన నివాళి అర్పించడమన్నారు. ఈసభలో సిపియం జిల్లా, నగర నాయకులు జివిఎన్. చలపతి, వి.వి.శ్రీనువాసరావు, బి.జగన్, ఎస్.అరుణ, కె.ఈశ్వరరావు, గనిశెట్టి సత్యన్నారాయణ, దాసు, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

# జీఓ 301 ద్వారా ఇచ్చిన పట్టాలకు షరతులను తొలగించాలి

## -సిపియం డిమాండ్




గాజువాక: ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా జీఓ 301 ద్వారా ఇచ్చిన పట్టాలకు విధించిన షరతులను తొలగించాలని గాజువాక సి.పి.యం జోన్ డిమాండ్ చేసింది. మంగళవారం ఇంటింట ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సిఐటియు నాయకులు సి.హెచ్ నర్సింగరావు మాట్లాడుతూ సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ఇచ్చిన పట్టాలు 5సం. వరకు ఎటువంటి లావాదేవీలకు వీలు కాదని అనడం విడ్డూరంగా వుందని విమర్శించారు.

ఇనాం భూ బాదితుల నుంచి ఎందుకు డబ్బులు కట్టించుకున్నారో అని ప్రశ్నించారు.

చెల్లని పట్టాల్లో షరతులు తొలగించాలని, లబ్దిదారులకు తక్షణమే పూర్తి హక్కులతో కూడిన పట్టాలను మంజూరు చేయాలని అడిగితే స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇనాం దారుడికి మద్దతు పలుకు తున్నామని ప్రచారం చేయడం దారుణమని అన్నారు.

ఎవరు ఎవరికి వత్తాసు పలుకుతున్నారో అందరూ గమనిస్తున్నారని ఏద్దేవ చేసారు. షరతులను తొలగించి సర్వహక్కులు కల్గిన పట్టాలను మంజూరు చేయాలని, లేని యెడల పోరాటాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.యు.టి నాయకులు సుబ్బారావు, రాంబాబు, ఇనాం భూ భాదితులు పాల్గొన్నారు.

# పచ్చదనంతో పరవాడ పోలీస్ స్టేషన్ అధికారులు సహకారముతో మారిన స్టేషన్ రూపురేఖలు

పరవాడ : అధికారులు శ్రద్దకనభరిస్తే ప్రభుత్వకార్యలయాలు పచ్చదనంతో కళకళాడతాయి. పోలీసు స్టేషన్లు ఆహ్లాదానికి స్తావరాలవుతాయి. మానసిక బాధలతో ప్రభుత్వ అండకోసము వెళ్లేవారికి సాంత్వన చేకూరిస్తాయి. దీనికి చక్కటి ఉదహరణే పరవాడ పోలీస్ స్టేషన్. గతంలో అనేక సమస్యలుతో అద్వానంగా ఉండేది. పరవాడ సి.ఐ. స్వామినాయుడు,సబ్ ఇన్స్ పైక్టర్స్ వెంకటరావు, షరీప్ మరియు సిబ్బంది సహకారంతో అధునికతను సంతరించుకుంది. మౌలిక వసతుల్ని మెరుగుపరుచుకొని ఆహ్లాదానికి బాటలు వేసింది. స్టేషన్ ఆవరణములో (జామ, ఉసిరి, నేరుడు, బాదము,మామిడి) రకరకాలు పండ్లు చెట్లు ఉన్నాయి. స్టేషన్ ముందుభాగము అంతా పూలు మెక్కలు (బంతి,చామంతి,గులాబి)నాటి అందంగా తీర్చుదిద్దారు.ఇప్పుడు ఇవన్ని పెరిగి చూడముచ్చటిగా తయారుఅయ్యాయి. స్టేషన్ చుట్టూ నాటిన పూలమొక్కలు సైతం రంగురంగులు పూలు పూయడంతో ఈ ప్రాంగణవంతాఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది.ఇటీవల వనం-మనం కార్యక్రమంలో భాగంగా పరవాడ సర్కిల్‌ఇన్స్ పైక్టర్ బి.సి.హెచ్.స్వామినాయుడు సారద్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా అసిస్టెంట్ కమిషనర్ ఆప్ పోలీస్ ఆఫీసర్ జె.రామ్మోహన్ రావు హాజరు అయి మొక్కలు నాటారు.మొత్తం మీద పరవాడ పోలీసు స్టేషన్ అవరణముంతా ఒక్క చిన్న పార్క్ లా తీర్చుదిద్దారు. ఇవన్ని స్టేషన్ రూపురేఖలునూ పూర్తిగా మార్చివేసాయి. వివిధ సమస్యలు కేసులు పని మీద ఇక్కడకు వచ్చే పిర్యాదుదారులుసైతం స్టేషన్ ఆవరణములోని ఆహ్లాదకర వాతావారణాన్ని ఆస్వాధిస్తున్నారు.




# ఈనెల 10, 11 తేదీల్లో ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోనల్ కేరమ్స్, చెస్ టోర్నమెంట్



విశాఖపట్నం: ఎల్ఐసి సౌత్ సెంట్రల్ జోనల్ లెవల్ కేరమ్స్, చెస్ టోర్నమెంట్ 2017-18 పోటీలను ఈనెల 10, 11 తేదీల్లో విశాఖలోని స్వర్&ణ భారతి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసి డివిజనల్ స్పోర్ట్స్ కమిటీ ఛైర్మన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ పి.రమేష్‌బాబు తెలియజేశారు.

మంగళవారం ఎల్ఐసి కార్యా లయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10వతేదీన ఉదయం 9గంటలకు జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిధిగా టోర్నమెంట్ పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలనుండి 36 మంది మహిళలు, 37 మంది పురుషులు, 73మంది ఎల్ఐసి ఉద్యోగ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఎల్ఐసి మార్కెటింగ్ డివిజనల్ మేనేజర్ ఎ.నాగేంద్రకుమార్, డివిజనల్ స్పోర్ట్స్‌క్లబ్ కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### సంకుచిత రాజకీయమొద్దు

ప్రజా ప్రయోజనాలు, దేశ ప్రయోజనాల విషయంలో సంకుచిత రాజకీయాలను పక్కన పెట్టి కేంద్ర రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతమైన విధానం. కేంద్రం కూడా ఇదే స్ఫూర్తితో వ్యవహరించాలె. ఇప్పటికైనా మించి పోయింది లేదు. వచ్చే నెల తొమ్మిదవ తేదీన హైదరాబాద్‌లో జరిగే సమావేశంలోనైనా జీఎస్టీ కౌన్సిల్ విజ్ఞతతో వ్యవహరించి ఈ పన్ను భారాన్ని ఎత్తివేస్తుందని ఆశిద్దాం. దేశంలోనే అపూర్వమైన రీతిలో తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూ ర్చే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ప్రజోపయోగమైన ఈ కార్యక్రమాలకు అండగా నిలిచి ప్రోత్సహించడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత. కానీ ఆశ్చర్యకరమైన రీతిలో వీటిపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను పన్నెండు శాతం విధించి వ్యయభారాన్ని పెంచింది. కేంద్రం మొదట పద్దెనిమిది శాతం జీఎస్టీ విధించిందనే మాట వింటే ఇంకా ఆశ్చర్యం కలుగుతుంది. తెలంగాణ ప్రభు త్వం జీఎస్టీ విధింపు అన్యాయమని అంటే పన్నెండు శాతానికి తగ్గించింది. కానీ సమాజ రూపురేఖలను మార్చివేసే రీతిలో చేపట్టిన ఈ పథకాలపై అసలు పన్ను విధించడమేమిటనేది కేం ద్రాన్ని అడుగవలసిన ప్రశ్న. ప్రజోపయోగమైన పథకాలపై పన్నులు వేయడం తగదని తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచి కేంద్రానికి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నది. కేంద్రానికి విజ్ఞప్తు లు చేయడంతోపాటు జీఎస్టీ కౌన్సిల్‌లో కూడా ఈ అంశాన్ని లేవనెత్తింది. ఇటీవలే శనివారం ఢిల్లీలో జరిగిన జీఎస్టీ సమావేశంలో కూడా రాష్ట్రం తరపున హాజరైన మంత్రి కేటీఆర్ ప్రజోపయోగ నిర్మాణాలపై పన్ను ఉండకూడదని కోరారు. దీనికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా మద్దతు లభించింది. బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఇదే మాట వినిపించాయి. నిజానికి ఇది ఒక్క రాష్ట్రం సమస్య కాదు. అన్ని రాష్ట్రాలు ఎదుర్కొనే సమస్య. తెలంగాణ వాదన విన్న తరువాత, అన్ని రాష్ట్రాల నుంచి వివరాలు తెప్పించుకున్న తరువాత నిర్ణయం తీసుకుందామని కేంద్ర ఆర్థి క మంత్రి జైట్లీ జీఎస్టీ మండలిలో బదులు ఇచ్చారు. జైట్లీ ఇచ్చిన జవాబు కూడా ఏ మాత్రం సమంజసంగా లేదు. ఆయా రాష్ట్రాలలో ప్రాజెక్టుల వివరాలు తెప్పించుకోవలసిన అవసరం ఏమున్నది? ఇది ఆర్థిక పరమైన అంశం కాదు, నైతికమైన సమస్య. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అసాధారణమైన రీతిలో ప్రజల సం క్షే మం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రశంసనీయమైన బృహత్కార్యాలను చేపట్టింది. ఏ ఆడబిడ్డ మంచి నీటి కోసం బిందె పట్టుకొని కడప దాడి బయటకు వెళ్ళే పరిస్థితి ఉండకూదనే మహదాశయంతో ఇంటింటికీ నల్లా అందించే మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టింది. ఈ విధంగా మంచి నీటి సౌక ర్యం కల్పిస్తే కానీ మళ్ళా ఓట్లు అడుగబోమనే హామీ ఇవ్వడం ద్వారా తన దృఢ నిశ్చయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఈ మొత్తం ప్రాజెక్టు వ్యయం 35 వేల కోట్ల రూపాయలు. దీని పై 4, 200 కోట్ల మేర జీఎస్టీ విధించడం న్యాయ మా? కోటి ఎకరాలకు నీరు అందించాలనే సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం, పాలమూరు వంటి నీటి పారుదల ప్రాజెక్టులు చేపట్టింది. వీటికి తోడు ఊరూరికి తల్లివంటి చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని మిషన్ కాకతీయ పేర ప్రారంభించింది. పేదలు ఆత్మగౌరవంతో నివసించడానికి తోడ్పడాలనే కృత నిశ్చయంతో రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణం చేపట్టింది. రెప్పపాటు కూడా విద్యుత్ ప్రసారానికి అంతరాయం కలుగకూడదనే భావనతో యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేం ద్రాల నిర్మాణం తలపెట్టింది. ఉన్నత జీవనం, సమగ్రాభివృద్ధికి జీవనాడులైన రహదారుల నిర్మాణాన్ని కూడా సకాలంలో పూర్తి చేయాలని భావిస్తున్నది. ఈ పథకాల వ్యయం అంతా కలిసి రెండు లక్షల కోట్లకు పై మాటే. సదుద్దేశంలో చేపట్టిన ఈ ప్రాజెక్టులకు వ్యయభారాన్ని తామూ మోస్తామని ముందుకు రావలసింది పోయి పన్ను విధించడం ఏ మాత్రం సహేతుకం కాదు. బడ్జెట్‌లో కేటాయింపులు జరిపి, నిర్ణీత లక్ష్యం సాధించడానికి పరుగులు పెడుతున్న దశ లో కాళ్ళలో కట్టె పెట్టడం కేంద్ర ప్రభుత్వ ఔన్నత్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నది. ప్రాజెక్టుల కాంట్రాక్టులన్నీ పునస్సమీక్షించుకోవలసి వస్తుంది. సీమాంధ్ర పాలనలో ప్రాజెక్టులను ఏండ్ల కొద్దీ సాగదీసేవారు. వందల కోట్ల ప్రాజెక్టులు వేల కోట్లకు చేరుకునేవి. ప్రజా సంక్షేమం కన్నా కాంట్రాక్టుల, దళారుల, నాయకుల లబ్ధి ప్రధానాంశంగా ఉండేది. కానీ తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల మాదిరిగా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని కూడా మూడు షిఫ్టులలో కార్మికులను నియమించి వేగంగా నడిపిస్తున్నది. ఈ దశలో జీఎస్టీ భారం పేర అడ్డుపుల్లలు వేయడం తగదు.

## హెచ్-1బీ వీసాలతో ఏ దేశానికి లాభం?




హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్.. గత కొంతకాలంగా ఇటు భారత్‌కు, అటు అమెరికాకు వివాస్పదమైంది. ఈ వర్క్‌వీసాలపై వస్తూ తమ ఉద్యోగాలను భారతీయులు కొల్లగడుతున్నారని అమెరికా వాదిస్తుండగా.. భారత్ ఈ విమర్శలను కొట్టిపారేస్తోంది. అసలు ఈ వీసా ప్రొగ్రామ్ వల్ల ఎవరికి ప్రయోజనం? ఎవరికి ఉండదు? అనుకుంటే. ఇరు దేశాలు ఈ వీసా ప్రొగ్రామ్ వల్ల లబ్ది పొందుతున్నారని తాజా నివేదికల్లో వెల్లడైంది. ది యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్, సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ రీసెర్చర్లు చేసిన తాజా అధ్యయనంలో ఈ విషయం తెలిసింది. అటు అమెరికా, ఇటు భారత్ ఇరు దేశాలకు హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్ ఆర్థిక ప్రయోజాలను అందిస్తుందని చెప్పింది. అమెరికా వీసా ప్రొగ్రామ్ వల్ల ఇరు దేశాల ఆదాయాలు 17.3 బిలియన్ డాలర్లు పెరిగాయని, అంతేకాక అమెరికా, భారత్‌ల ఐటీ ఉత్పత్తి 2010లో 0.45 శాతం పెరిగిందని సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ గౌరవ్ ఖన్నా, మిచిగాన్ యూనివర్సిటీ నికోలాస్ మోరాలెస్ పేర్కొన్నారు. అదేవిధంగా ఈ ప్రొగ్రామ్ వల్ల 2010లో అమెరికా ఉద్యోగుల సంపద 431 మిలియన్లకు పెరిగినట్టు కూడా తెలిపారు. ఇమ్మిగ్రేషన్‌తోనే ప్రతి దేశంలోని యావరేజ్ వర్కర్ ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దబడ్డారని అధ్యయనం తెలిపింది.

అమెరికా స్థానిక వర్కర్లకు హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్ ఎక్కువ లబ్ది చేకూరుస్తుందని ఖన్నా చెప్పారు. "అమెరికా కలను సాధించే క్రమంలో ఐటీ బూమ్, ఇతర పర్యవసనాలు" అనే టైటిల్‌తో ఈ అధ్యయన రిపోర్టును రూపొందించారు. హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్‌పై లోతైన విశ్లేషణ, 2000 కాలం నుంచి అమెరికా, భారత ఆర్థిక వ్యవస్థలపై దీని ప్రభావం వంటి విషయాలపై అధ్యయనం చేశారు. ఈ ప్రొగ్రామ్ ద్వారా విదేశీయులకు అమెరికాలో ఉద్యోగం కల్పించడానికి కంపెనీలకు అనుమతి ఉంటుంది. దేశీయ ఐటీకి అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న అమెరికాలో భారత కంపెనీలు టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్‌లు హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్‌ను వాడుతూ విదేశీయులకు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. ఈ ప్రొగ్రామ్ ద్వారా తక్కువ వేతనానికి భారతీయులను కంపెనీలు నియమించుకుంటూ...తమ ఉద్యోగాలకు గండికొడుతున్నాయని అమెరికా వాదిస్తోంది. హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్‌పై అమెరికా కఠినతరమైన నిబంధనలు తీసుకొస్తోంది.

## ఉద్యోగాలు కోల్పోయిన పోలీస్ పర్వాతారోహకులు



పుణె: ఎవరెస్టు శిఖరం అధిరోహించామని తప్పుడు ప్రచారం చేసిన పుణె పోలీస్ దంపతులు ఉద్యోగాలు కోల్పోయారు. గతేడాది జూన్‌లో ఎవరెస్టు అధిరోహించామని దినేశ్ రాథోడ్, తారకేశ్వరీ రాథోడ్ పోలీస్ దంపతులు ప్రచారం చేసుకున్నారు. అయితే వీరు అసలు ఎవరెస్టే ఎక్కలేదు.. మార్ఫింగ్ ఫొటోలతో తప్పుడు ప్రచారం చేసి జనాలను, పుణె పోలీస్ శాఖను తప్పు దోవ పట్టించారు.

గతేడాది జూన్5 న ఎవరెస్టు అధిరోహించిన తొలి పోలీస్ దంపతులమని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారు. ఇది చూసిన స్థానిక పర్వతారోహకులు ఈ దంపతులు ఎవరెస్టు ఎక్కలేదని, నేపాల్ ప్రభుత్వం గతేడాదే దంపతుల పర్వతారోహణాన్ని 10 ఏళ్ల వరకు నిషేదించిందని పుణె పోలీసులకు సమాచారం ఇచ్చారు. నేపాల్ ప్రభుత్వ నిషేదాన్ని నిర్ధారించుకున్న పుణె పోలీసులు విచారణ చేపట్టగా మార్ఫింగ్ పోటోలతో మోసం చేశారని వెల్లడైంది. వెంటనే శాఖపరమైన చర్యలు తీసుకుంటూ ఉద్యోగాల నుంచి తొలిగించారు.

## చిన్నారులకు ఆర్టీసీ రాయితీ

అమరావతి: సీనియర్ సిటిజన్లకు ఏసీతో సహా అన్ని బస్సు టిక్కెట్లపై రాయితీ ప్రకటించిన ఆర్టీసీ చిన్నారులకు కూడా రాయితీ ఇవ్వనున్నట్టు తెలిపింది. ఈ మేరకు ఆర్టీసీ ఈడీ జయరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఐదేళ్లలోపు చిన్నారులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని, అలాగే 12 ఏళ్లలోపు పిల్లలకు ఏసీ బస్సు సర్వీసుల్లో 25 శాతం, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ సహా అన్ని బస్సుల్లో అయితే 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

కాగా, ఈ రాయితీ పొందాలంటే వయస్సు ధ్రువీకరణ పత్రం చూపించాల్సి ఉంటుందని జయరావు స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ గెలుస్తారా !

అహ్మదాబాద్ : గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికల పోలింగ్ ఉత్కంఠ రేపుతోంది. మూడు స్థానాలకు జరుగుతోన్న ఈ ఎన్నికల్లో భాజపా నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఒకరు బరిలో నిలిచారు. రాజ్యసభ ఎన్నికల్లో గెలిచేందుకు ఒక్కో అభ్యర్థికి 45 ఓట్లు అవసరం కానున్నాయి. భాజపాకు 121 మంది ఎమ్మెల్యేలు ఉండటంతో ఇప్పటికే అమిత్‌షా, స్మృతి ఇరానీల విజయం ఖాయమైనట్టే.

అయితే, ప్రస్తుతం బల్వంత్ సిన్హా రాజ్‌పుత్, కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్‌కు మధ్య పోరు రసవత్తరంగా మారింది.

మొత్తం 182 మంది సభ్యులున్న గుజరాత్ అసెంబ్లీలో భాజపాకు 121 మంది, కాంగ్రెస్‌కు ఇది వరకు 57 మంది ఎమ్మెల్యేలు ఉండేవారు. ఆరుగురు రాజీనామా చేయడం, వాఘేలాతో మరో ఏడుగురు విడిపోవడంతో ప్రస్తుతం 44 మందే మిగిలారు. కాంగ్రెస్ శిబిరంలో ఉన్న ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినా, నోటా గుర్తుకు ఓటేసినా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నిరాశే ఎదురవుతుంది. భాజపా మూడో అభ్యర్థి బల్వంత్ సిన్హా రాజ్‌పుత్ గెలుపునకు ఇంకా 14 మంది సభ్యుల మద్దతు అవసరం. గుజరాత్ అసెంబ్లీలో ఇద్దరు సభ్యులు కల్గిన ఎన్సీపీ సైతం ఆఖరి నిమిషంలో భాజపాకు తన మద్దతు ప్రకటించడం కీలకంగా మారింది. అంతేకాకుండా ఇతరుల నుంచి కూడా తమకు ఓట్లుపడే అవకాశం ఉందని భాజపా ధీమా వ్యక్తంచేస్తోంది.

## కవి సమయం

### "దప్పికి కరువు రోజులు పోవాలి"

పల్లవి : ఏదిరో దప్పికి కళ్ళు తిరిగిపోతుంటే?
పొద్దల్ల పాటులతో వేళ తిరిగిపోతుంటే?
కసింత దప్పిక్కి కడపార బెట్టాలా?
నిండార దప్పిక్కి నోరారగించాలా? "ఏదిరో"

చరణం : పుట్టిన పుడమినా - కలిమి యిదేనా?
కనిన తల్లి పుణ్యానికి న్యాయమిదేనా?
చూడండ్రో పాలకులు మా వైపు
నడపండ్రో ప్రజా పాలననిపిస్తు "ఏదిరో"

చరణం : స్వయం కృషి పాలన మనదన్నాం
కొనబోతె ధరలెంతో ఎగువన్నాం
ఏవేవి కొనగలరు పేదోళ్ళు
స్వరాజ్య మన్నది యిలగుంద; "ఏదిరో"

చరణం : కాసినోళ్ళు బిడ్డలతో పాపాల?
మురికి నీరు కొండల్లో జీవాల?
కనికారం లేనన్ని జబ్బులు
ధనముంటే ఔనన్న మందులు "ఏదిరో"

చరణం : సంపాదన యెంతుంటే సంతోషం?
నడపలేని పరిపాలన ఏమంటం;
సభలలో పలుకుబడి యెంతెంతో
తప్పట్లు కొట్టుటే ఆనందం "ఏదిరో"

:- దప్పికి కరువు రోజులు పోవాలి:-

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

## పంచాంగం

మాసం : శ్రావణ ; విదియ రా.11.52;
శతభిషం పూర్తి మ.వ.12.42ల 2.21

బుధవారం
09-08-2017

**మేషం** : విద్యా విషయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. అవివాహితులకు అనుకూలం. శస్త్ర చికిత్స సమయంలో వైద్యులకు ఏకాగ్రత అవసరం. చేతి వృత్తులు, చిరు వ్యాపారులు, చిన్న తరహా పరిశ్రమల వారికి ఆశాజనకం. ఉద్యోగులు అపరిచిత వ్యక్తుల పట్ల వ్యవహరించండి. కుటుంబీకులతో ఉత్సాహంగా గడుపుతారు. **వృషభం** : పిల్లల, ప్రియతముల విషయంలో అధికంగా ఖర్చు చేస్తారు. అనుకోని సంఘటనలు ఎదురవుతాయి. లీజు, ఏజెన్సీ, నూతన కాంట్రాక్టుల విషయంలో పునరాలోచన అవసరం. పెద్దల సానుభూతి లభిస్తుంది. కిరాణా, ఫ్యాన్సీ, గృహోపకరణ వ్యాపారులకు పురోభివృద్ధి. **మిథునం** : మీ మాటకు ఇంటా బయటా ఆదరణ లభిస్తుంది. నూతన వస్తు ప్రాప్తి. విదేశీ ప్రయత్నాలు ఫలిస్తాయి. పండ్ల, కూర, పానీయ వ్యాపారస్తులకు అనుకూలం. **కర్కాటకం** : స్త్రీలు భేషజాలు పోకుండా పరిస్థితులకు అనుగుణంగా మెలగవలసి ఉంటుంది. కార్య సాధనలో జయం పొందుతారు. నూతన వ్యాపారాలకు సంబంధించిన ఒక నిర్ణయానికి వస్తారు. భాగస్వామి విషయంలో ఆందోళన చెందుతారు. రావలసిన ధనం సకాలంలో మీ చేతికందును. **సింహం** : దూర ప్రయాణాల లక్ష్యం నెరవేరుతుంది. ఒక వ్యవహారం నిమిత్తం న్యాయవాదులను సంప్రదిస్తారు. మీ అంత రంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ఖర్చులు అధికమైనా ప్రయోజనపరంగా ఉంటుంది. **కన్య** : వ్యాపార రంగంలోని వారికి అభివృద్ధి కానవస్తుంది. ఆర్థిక లావాదేవీలకు అనుకూలం. ఆరోగ్య విషయంలో జాగ్రత్త పాటించండి. కుటంబ సభ్యుల ధోరణి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. **తుల** : ఊహించని ఖర్చులు మీ అంచనాలు దాటిన మిత్రుల సహాయ సహకారముల వలన సమసిపోగలవు. ఉద్యోగస్థులకు పురోభివృద్ధి కాన వచ్చిన కొంత మంది మాట తీరు, కొన్ని వార్తలు మీకు ఆందోళన కలిగిస్తుంది. కొంత మంది మిమ్మల్ని ధన సహాయం అర్థిస్తారు. **వృశ్చికం** : విందులు, వినోదాల్లో పాల్గొంటారు. నూతన పరిచయాలు పెంచు కుంటారు. సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఏకాగ్రతతో వ్యవహరిస్తారు. నిరుద్యోగులకు అవకాశం లభించిన దాన్ని వినియోగించుకోలేరు. **ధనుస్సు** : వృత్తి, వ్యాపారానికి సంబంధించి ఓ సమాచారం కలవర పరుస్తుంది. సృజనాత్మకంగా ఆలోచిస్తారు. దూరంలో ఉన్న వ్యక్తులకు సంబంధించి కీలకమైన సమాచారం అందుకుంటారు. **మకరం** : కోర్టు వ్యవహారాలు వాయిదా పడుట మంచిది. మీ కళత్రం మొండి వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. మీ సంతానం ఆరోగ్యం, విద్యా విషయాల గురించి ఆలోచిస్తారు. వాహన యోగం పొందుతారు. **కుంభం** : ఏజెంట్లు, బ్రోకర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు శ్రమకు తగిన ఫలితం కానవస్తుంది. మీ అంతరంగిత సమస్యలకు పరిష్కార మార్గం కానరాగలదు. మీ అలవాట్లు, బలహీనతలు అదుపులో ఉంచుకోవడం మంచిది. **మీనం** : కొబ్బరి, పండ్ల, పానీయ వ్యాపారస్తులకు అనుకూలమైన కాలం. స్పెక్యులేషన్ కలసిరాగలదు. వృత్తులలోని వారికి, పౌరోహితులకు చికాకు తప్పదు. పారిశ్రామిక రంగంలోని వారికి నూతన ఆలో చనలు స్ఫురిస్తాయి. ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోకండి.



## రామాయణం: సీతాదేవి వ్యక్తిత్వం.. ప్రత్యేకత

### సంకీర్తన

క్షమ..దయ...ధైర్యం...వివేకం...ఆత్మాభిమానం కలబోసిన ఉదాత్తమైన స్త్రీ పాత్ర సీత'. సతీ లేనిదే రామాయణం లేదు. సీత లేకుండా రాముని జీవితాన్ని అసలు ఊహించలేము. కాబట్టే రామాయణ ఇతిహాసంలో ఆమె పాత్రపై ఎందరో మహానుభావాలు మరియు మేధావులు పరిశోధనలు కూడా చేశారు. సీతలోని సుగుణాలు నేటి మగువలకు ఎంతో ఆదర్శం. ఆమె చరితం ఓ స్ఫూర్తిదాయకమైన కథాసాగరం. రామాయణంలో ఏ ఘట్టం తీసుకున్నా సీత గుణగుణాలు ప్రతి ఒక్కరికీ ఎంతో ఆదర్శప్రాయంగా నిలుస్తాయి... ధర్మమూర్తి: సీత ఒక ఇల్లాలిగా తన భర్త బాధ్యతలో, కర్తవ్య దీక్షలో తను కూడా పాలుపంచుకొని ఆదర్శ గృహిణిగా మారిన మహాసాధ్వి సీతాదేవి'. రాముడు తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి అరణ్యవాసానికి వెళ్లినప్పుడు తన భర్త అడుగుజాడల్లో తనూ నడిచి, అతని కష్టసుఖాల్లో పాలు పంచుకోవడానికి సిద్ధమైన ధర్మపత్నిగా తన ధర్మాన్ని నిర్వర్తించింది. దయాశీలి: పేదవారిని ఆదరించి అన్నం పెట్టాలన్న దయాగుణం గల స్త్రీమూర్తి సీత. అదే భావనతో తనింటికి మారువేషంలో బిక్షాటన వచ్చిన రావణుడికి లక్ష్మణరేఖ దాటి మరీ భిక్షం వేసిన దయామూర్తి ఆమె. తన రక్షణ కోసం పెట్టుకున్న నియమం కన్నా దానమే గొప్పదన్న నీతిని ఆమె ఈ సందర్భంలో వెల్లడిస్తున్నది. ధైర్యశాలి: పాతివ్రత్య నిరూపణ కోసం సీతను అగ్నిప్రవేశం చేయమని రాముడు అడిగినప్పుడు ధీరత్వంతో ఆ పనికి సిద్ధమైన ధైర్యశాలి సీత. రాముని మాటలు ఆమె గుండెను గాయపరిచినా సహనంతో భరించింది. తానే తప్పు చేయలేదన్న ఆమె ఆత్మవిశ్వాసం చివరికి నిందారోపణ చేసిన వారిని సైతం తలదించుకునేలా చేసింది. అబిమానవతి: సీతకు ఆత్మాభిమానం ఎక్కువ. చిత్రకూటానికి సీతారాములు వచ్చారని తెలిసి, ఆమె తండ్రి జనకుడు వారిని కలిసి వనవాసం పూర్తయ్యేదాకా మిథిలానగరానికి వచ్చి తనతో పాటు ఉండమని కోరినప్పుడు, ఆ మాటలను సున్నితంగా తిరస్కరించిన ఆత్మాభిమాని సీత. మెట్టినింటికొచ్చాక ఎన్ని విషమ పరిస్థితులెదురైనప్పటికీ తమే పరిష్కరించుకోవాలి గానీ, పుట్టింటి వారిని ఇబ్బంది పెట్టకూడదన్న అభిమానవతి సీత. జంతు ప్రేమికురాలు: ప్రకృతి మీద, పశుపక్ష్యాదుల మీద ఎనలేని ప్రేమ కలిగిన స్త్రీమూర్తి సీత. అదే ప్రేమతో అందమైన జింకను తన కోసం తీసుకురమ్మని భర్తను అభ్యర్థిస్తుంది సీత. వివేక వంతురాలు: రావణాసురుడు తనను అపహరించి తీసుకెళ్లి పోతున్నప్పుడు, రాముడికి తన ఆనవాళ్లు చిక్కడం కోసం బంగారునగలను నేల మీద జారవిడిచిన వివేకవంతురాలు సీత. ప్రేమమూర్తి: సీతకు రామునిపై ఎంతటి ప్రేమాను రాగాలంటే..ఆ ప్రేమలో తనను తానే మైమరిచిపోయేది. రావణుడి చెరలో బందీగా ఉండి కూడా నిత్యం శ్రీరామనామస్మరణ చేస్తూ అను క్షణం పతి క్షేమాన్ని కోరేది. చైతన్యశీలి: సీత ఎంత చైతన్యశీలి అంటే అపా యంలో కూడా భయంతో ఆమె శత్రువులకు లొంగలేదు. రావణుడు సీతను బెదిరించి, తన వశం కావాలని ఆదేశించినప్పుడు, ఒక గడ్డిపరకను అడ్డంగా పెట్టుకొని నువ్వు నాకు దీనితో సమానం అని చెప్పకనే చెప్పి అతని ధర్మహీనతను ప్రశ్నించిన ప్రజా వంతురాలామె. క్షమాగుణం: రాక్షస సంహారం తర్వాత సీతను అశోకవనం నుంచి విడిపించి తీసుకువెళ్తున్న సమయంలో, తను బందీగా ఉన్నప్పుడు ఆ వనంలో తనను మాటలతో హింసించిన రాక్షసులకు ఏ కీడు తల పెట్టవద్దని, వారు స్వామిభక్తితో తమ బాధ్యతను మాత్రమే నిర్వర్తించారని హనుమంతునితో చెప్పిన క్షమాగుణం సీత సొంతం. ఆదర్శమూర్తి: అడవిలో ఆశ్రమవాసిగా కాలం గడుపుతూ కూడా తన కుమారులను ప్రయోజకుల్ని చేయాలని ఎల్లవేళలా తపిస్తూ, వారిని కార్యసాధకులుగా తీర్చిదిద్దడం ఆమె ఉత్తమ పెంపకానికి నిదర్శనం.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## రెండో విడత కరువు భత్యాన్ని
# విడుదల చేయాలి

విజయనగరం: ఒక విడత విడుదల చేసిన డీఏగా ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రెండో విడత డిఏగా ప్రభుత్వం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు అడ్డూరి పైడితల్లి దొర డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు 3.668 శాతం కరువు భత్యాన్ని మంజూరు చేస్తూ కేబినేట్ తీర్మానించడం హర్షనీయమన్నారు. ఇంకా బకాయి పడిన 2017 జనవరి డిఏను కూడా సకాలంలో విడుదల చేయాలని కోరారు. అలాగే 10వ పీఆర్‌సి ప్రకారం ఉద్యో వర్గాలకు చెల్లించాల్సిన పీఆర్‌సి బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, గిరిజనులకు మెరుగైన విద్య, వైద్య, మంచినీటి, రోడ్లు, రవాణా సౌకర్యాలు కల్పించాలని సంఘనేతలు, సంఘ మహిళ ప్రతినిధుల కోరిన వారిలో ఎం.అమర్‌నాథ్, ఎ.తవిటందొర, కె.అప్పారావు, ఎ.త్రినాద్, ఎం. సత్యన్నారాయణ, సి.హెచ్.బంగారుదొర, టి.పద్మావతి, కె.సునీత, పి. సుగుణకుమారి తదితరులు డిమాండ్ చేశారు.

# పాఠశాలకు మెగా ఫోను వితరణ


మెగా ఫోను వితరణ చేస్తున్న దృశ్యం

గరివిడి: మండలంలో కోడూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు గవిడి గణేష్ అనే యువకుడు ఒక మెగా ఫోను వితరణగా ఇచ్చాడు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అడపా జానకి రమణమ్మ మాట్లాడుతూ పాఠశాలలో జరిగే కార్యక్రమాలకు ఈ ఫోను ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.

గణేష్‌ను ఆదర్శంగా తీసుకుని పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావా లని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపిటిసి పద్మ, ఎస్.ఎమ్.సి. చైర్మన్ గవిడి హరి కృష్ణ, గ్రామ టి.డి.పి. నేతలు అడపా సూర్య నారాయణ ఎలకల వెంకు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దటానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములై
# ఉద్యమ స్ఫూర్తితో కృషి చేయాలి : జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్



విజయనగరం: స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా జిల్లాను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దటానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఉద్యమ స్ఫూర్తితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో స్వచ్ఛదూతలు, తాపీ మేస్త్రీలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎంపికచేసిన 336 గ్రామాల్లో ప్రతి గ్రామంలో స్వచ్ఛదూతలు బహిరంగ మల విసర్జన ద్వారా సంభవించే నష్టాలను, సమస్యలను వివరించి ఆయా గ్రామస్తులు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు పూనుకొనేలా అవగాహన కల్పించి చైతన్యపర్చాలని సూచించారు. అక్టోబర్ 2 నాటికి ఈ 336 గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి సహకరించాలన్నారు. ఇదివరకు చిన్న చిన్న సమస్యలు ఉన్నప్పటికీ ప్రస్తుతం సమస్యలు ఏమీ లేవని స్పష్టం చేసిన కలెక్టర్ సిమెంటు అందుబాటులో ఉందని, ఇసుక ఉచితంగా లభిస్తుందని, తాపీ మేస్త్రీలు మరుగుదొడ్ల నిర్మాణానికి ఉత్సాహంగా ఉన్నారని వివరించారు. మరుగుదొడ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.15వేలు ప్రోత్సాహకాన్ని కూడా వెంటనే మంజూరు చేయటంలో ఇబ్బందులు లేవన్నారు. అదే విధంగా అవసరమైన గ్రామాల్లో స్త్రీశక్తి ఋణాలను అందజేస్తామన్నారు. ప్రతీ గ్రామానికి స్వచ్ఛదూతలను నియమించామని, వారు ఆయా గ్రామాల్లో ప్రజలను మరుగుదొడ్ల నిర్మాణాలకు ఆకర్షితులయ్యే విధంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మహిళలు, యుక్త వయస్కులు బయటకుపోయి మల విసర్జన చేయటం అనాగరికమని, ఆత్మ గౌరవానికి ఆటంకమని, అభద్రత కూడా ఉంటుందని విశ్లేషించిన కలెక్టర్ వారి ఆత్మగౌరవానికి భంగం కలుగకుండా ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోవడం కన్నా మంచిపని ఏముంటుందని ప్రశ్నించారు.



అదే విధంగా బహిరంగ మల విసర్జన ద్వారా పరిసరాలు, వాతావరణం, నీరు కలుషితమై మనకు తెలియకుండానే అనేక రోగాలు సంభవిస్తాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో పెట్టుకొని మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్వచ్ఛ దూతలకు ఒక్కొ మరుగుదొడ్డి నిర్మాణం పూర్తికి వంద రూపాయలు చొప్పున ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. అదే విధంగా 6 నెలల పాటు మరుగుదొడ్లు వినియోగించుకునేలా ప్రోత్సహిస్తే మరో 50 రూపాయిలు ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. గ్రామస్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేసి బహిరంగ మలవిసర్జన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా పర్యవేక్షక ఇంజనీరు ఎన్.వి.రమణమూర్తి, శిక్షకురాలు బాపట్ల ఇఒ పిఆర్‌డి మాధురి, సుమారు 240 మంది స్వచ్ఛదూతలు 140 మంది తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

## నేటి మనదేశం



దత్తిరాజేరు: మండల కేంద్రంలో ఎమ్.పి.డి.ఒ ఆఫీసులో బిసి, ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్ ఇంట ర్యూలు జరిగాయి. ఈ యొక్క కార్యక్రమం గర్భాం, పెద మానాపురం, బాడంగి, ఆరికతోట బ్యాంక్ పరిధిలో ఇంటర్యూలు నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఎమ్‌పిపి బెజవాడ. రాజేశ్వరి, ఎమ్.పి .డి.ఒ పట్నాయక్ గారు, జూనియర్ అసిస్టెంట్ నవీన్, గర్భాం ఫీల్డ్ ఆఫీసరు వినోద్‌గారు హాజరు అయినారు.

## స్వయం ఉపాధి పథకాలు మంజూరుకై మౌఖిక పరీక్షలు

విజయనగరం: విజయనగరం మండల పరిధిలో గల గ్రామ పంచాయితీలకు సంబంధించి 2017-18 సంవత్సరములో బి.సి కార్పొషన్, ఎస్సీ కార్పోరేషన్, కాపు కార్పోరేషన్, మైనార్టీ కార్పోరేషన్, క్రిష్టియన్ కార్పోరేషన్ల ద్వారా స్వయం ఉపాది పథకాలు మంజూరు కోసం లెవిల్ స్క్రినింగ్ కమిటీచే మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు విజయనగరం ఎమ్మార్వో ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, రేషన్‌కార్డు, ఆదార్‌కార్డులతో సహా హాజరు కావాలన్నారు. 10వ తేదీ ఉదయం 10 గంటలకు బి.సి. కార్పోరేషన్ రుణాల ఎంపిక, 11వ తేదీ ఉదయం 10 గంటలకు ఎస్సీ కార్పోరేషన్, కాపు కార్పోరేషన్, మైనార్టీ కార్పోరేషన్, క్రిష్టియన్ కార్పోరేషన్లు ఋణాల ఎంపిక జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 08922-226046 నెంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

## పొలం పిలుస్తోందిలో
# వ్యవసాయాధికారిణి శిరీష



వేపాడ: మండలంలో అడపాదడపా వరి నాట్లు వేసుకొనే రైతులు పరినారు చివర్లు కత్తిరించి నాట్లు వేసుకోవడం మంచిదని మండల వ్యవసాయాధికారిణి శిరీష అన్నారు. మంగళవారం మండలంలోని నల్లబిల్లి, వావిలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామాల్లో రైతాంగం అక్కడక్కడ వరినాట్లు వేస్తుండడంతో వ్యవసాయాధికారులు పొలం బాట పట్టారు. నాట్లు వేసుకునే రైతుల చెంతకు చేరుకొని వరిచివర్లు కత్తిరించి నాట్లు వేసుకోవాలని సూచించారు. దీని వలన పీకపురుగును నివారించుకోవచ్చునన్నారు. అలాగే ఈ ప్రాంత భూముల్లో జింక్‌లోపం ఉండడం వలన దమ్ములో జింక్‌సల్పేట్ వేసుకోవడం మంచిదన్నారు. ఎకరాకి సుమారు 20 కేజీల జింక్ సల్పేట్ ఇసుకలో కలిపి జల్లు కోవాలన్నారు. జింక్‌లోపం ఉన్న భూముల రైతులకు 100 శాతం రాయితీపై జింక్ సల్పేట్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. దీనిని సద్వినియోగపర్చుకోవాలని వ్యవసాయాధికారులు సూచించి చివర్లు కత్తిరించి నాట్లు వేసుకోవడం మంచిది. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా సాగుతున్న
# ఎంఆర్ టీకా కార్యక్రమం

వేపాడ: మండలంలో 8 రోజులుగా నిర్వహిస్తున్న మెజిల్స్ రూబెల్లా టీకా కార్యక్రమం విజయవంతంగా సాగుతుందని వేపాడ పిహెచ్‌సీ వైద్యాధికారి వీరభద్రరావు అన్నారు. మంగళవారం ఆకుల సీతంపేట గ్రామ సమీపంలోని కేంబ్రిడ్జి స్కూలు నందు నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాన్ని పరిశీలించినట్టు తెలిపారు. ఎనిమిది రోజులు నుంచి నేటి వరకు 36 పాఠశాలల్లో 2425 మంది విద్యార్థినీ, విద్యార్థులకు మెజిల్స్ రూబెల్లా టీకా ఇవ్వడం జరిగిందన్నారు. మిగతా విద్యార్డులకు 10 మరియు 11 తేదీలలో టీకా కరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ రమేష్‌బాబు పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ సూర్య నారాయణ వర్ధంతి



అచ్యుతాపురం: సిఐటియు జిల్లా మాజీ అద్యక్షులు కామ్రేడ్ ఎమ్.సూర్యనారాయణ వర్ధంతిని స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం సిఐటియు నాయకులు బుద్దా రంగారావు ఆయన చిత్ర పఠానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్దా రంగారావు మాట్లాడుతూ కామ్రేడ్ సూర్యనారాయణ విద్యార్ధి దశ నుండే ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని గిరిజన ఉద్యమానికి అండగా నిలిచారన్నారు. అటవి హక్కుల చట్టం అమలుకై, కాఫీ బకాయిలపై అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితమిచ్చారన్నారు. ఆయన ఆశయ సాదనకు అందరూ కృషి చేసిన నాడే మనమిచ్చే నివాళి. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము, మండల కార్యదర్శి కె.సోమునాయుడు, నూకరాజు, శ్రీను, వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో నిండుకున్న పాలు
## గుడ్లు పక్కదారి పట్టడాన్ని పర్యవేక్షించిన ప్రజాప్రతినిధులు


అంగన్వాడీ కేంద్రంలో గుడ్లు తింటున్న చిన్నారులు



అంగన్వాడీ కేంద్రానికి సరఫరా నిలిచిపోయిన పాల ప్యాకెట్లు ఇవే

నర్సీపట్నం : అంగన్వాడీ కేంద్రాల్లో పాలు నిండుకున్నాయి. గుడ్లు పక్కదారి పడుతున్నాయని అంగన్వాడీ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. నిండు గర్భిణీల సైతం అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా నిలిపివేసిందా లేదా అంగన్వాడీకార్యకర్తలు దొంగిలిస్తున్నారా అనే అనుమానాలు తీవ్రంగా బయటకు వస్తున్నాయి. మండలంలో ఒక ప్రజాప్రతినిధులు గుడ్ల వినియోగంపై నిఘా ఏర్పాటు చేశారు. వారు ఇచ్చిన కొన్ని ఆధారాల ప్రకారం అంగన్వాడీ కార్యకర్తలు గుడ్లను అమ్మేసుకుంటున్నారనే వాదన బలంగా వినిపిస్తుంది. సదరు ప్రజాప్రతినిధి గ్రామంలో కూడా అంగన్వాడీ కార్యకర్తలు గుడ్లు అమ్మేసుకోవడాన్ని గుర్తించి సదరు ప్రజాప్రతినిధిగా తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. దీనికి తోడు ప్రస్తుతం పాలు కూడా గర్భిణీలకు రాకపోవడంతో వీటిని కూడా అంగన్వాడీలు పక్కదారి పట్టిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తల్లిపాల వారోత్సవాలను వారంరోజులుగా నిర్వహించిన అంగన్వాడీ సిబ్బంది, కార్యకర్తలు అసలే పాలే పంపిణీ చేయకపోవడం చాలా విరుద్ధంగా ఉందంటూ గ్రామాల్లోని గర్భిణీలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గుడ్ల వినియోగం విషయంలో చాలా కేంద్రాల్లో భారీగా నిల్వ ఉండటం, కొన్ని కేంద్రాల్లో పక్కదోవ పట్టడం జరుగుతుందని ప్రజాప్రతినిధి ఒకరు తమ వినికిడిలో బయట పడినట్లు తెలియ జేశారు. కేవలం ప్రచారాల కోసమే ప్రాధాన్యత ఇవ్వ కుండా అధికారులు ఏఏ సరు కులు సరఫరా అవుతున్నది, ఏఏ సరుకులు సరఫరా కాలే నిది ఖచ్చితంగా ప్రజలకు తెలిసేలా చేస్తే బాగుంటుందని అంగ న్వాడీ లబ్ధిదారులు కోరుతున్నారు. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిదులతో సమన్వయం ఏర్పరచుకొని విషయాన్ని బహిరంగంగా అందరికి తెలిసేలా చేయాలని చేయాలని ఏ విషయాలను గోప్యంగా ఉంచకూడదని ఇటు ప్రజా ప్రతినిధులు, అటు అంగన్వాడీ లబ్ధిదారులు అంగన్వాడీ అధికారులను కోరుతున్నారు.

# తట్టు, రుబెల్లా టీకా పిల్లలకు తప్పనిసరి

మెంటాడ: తట్టు, రూడెల్లా టీకా తొమ్మిది నెలలు నుంచి 15 ఏళ్ళు మద్య వయస్సు గల పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని చల్లపేట ఆరోగ్యకేంద్రం వైద్యధికారి షేక్ నసీరుద్దీన్ అన్నారు. మంగళవారం కుంటినవలస, పెదచామలపల్లి గ్రామాల్లో టీకాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా పిహెచ్‌సి పరిధిలో ఉన్న తొమ్మిది నెలల నుంచి 15ఏళ్ళ మధ్య గల పిల్లలకు టీకాలు వేసి శతశాతం పూర్తి చేయడం జరుగుతుందన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో టీకాలు వేసేందుకు ప్రతి చిన్నారి ఈ టీకా పొందేలా వైద్య సిబ్బందితో ఖచ్చితమైన ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. పిల్లలకు టీకాలు వేయించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించేందుకు వైద్య సిబ్బంది, యువత పనిచేయాలన్నారు. అదే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళాసంఘాలు, ఉపాధ్యాయులు కార్యక్రమంలో భాగస్వాములు చేయడం జరుగుతుందన్నారు. తట్టు ఒక ప్రాణాంతక వ్యాధని, దీనికి కారణంగా చిన్నారులు న్యూమోనియో, విరేచనాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధులకు గురవుతారన్నారు. ఒక్కోసారి ఇది మరణానికి కూడా దారి తీయొచ్చన్నారు. ఇది తుమ్మడం, దగ్గడం ద్వారా ఒకరి నుండి ఒకరికి సోకుతుందన్నారు. తీవ్రమైన జ్వరం, చర్మం మీద ఎర్రని దద్దుర్లు, దగ్గు, జలుబు, కళ్ళు ఎర్రబడటం, తట్టు సాదారణ లక్షణాలని నసీరుద్దీన్ తెలిపారు. రూబెల్లా వ్యాధి గర్భంతో ఉన్న మహిళలకు సోకితే ఇది పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. దీని లోపాలు కలుగుతాయని అన్నారు. కొన్ని సందర్భాల్లో గర్భస్రావం, మృతశిశువు టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, గ్రామాల పురజనులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జ్వరంతో లోతుగెడ్డ విద్యార్థిని మృతి



మెంటాడ: మండలంలో లోతుగెడ్డ గ్రామానికి చెందిన అగతాన నీలిమ (14) జ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలు ఇలావున్నాయి. మృతురాలు నీలిమ నెల్లిమర్ల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 6వ తరగతి చదువుతుంది. పదిరోజుల క్రితం జ్వరం వచ్చింది. హాస్టల్ సిబ్బంది జ్వరానికి మందులు వాడారు. నీలిమ పుట్టిన రోజు ఈనెల 4వ తేదిన తల్లి సాయమ్మ బర్త్‌డే కేక్ పట్టుకొని హాస్టల్ కు వెళ్ళింది. కేక్ ఇవ్వడానికి హాస్టల్ లోనికి వెళుతుండగా సిబ్బంది ఆమెను ఆపి కేక్ నీలియకు అంద జేస్తామని, మీరు వెళ్లి పోవచ్చునని చెప్పారు. దీంతో తల్లి సాయమ్మ ఇంతదూరం వచ్చి కూతురును చూడకుండా వెళ్ళనని సాయంత్రం వరకు వేచివుంది. కుమార్తె పరిస్థితిని చూసి ఇంటికి తీసుకువచ్చింది. 7వ తేదిన గజపతినగరం సి.హెచ్.సి. నీలిమను తీసుకెళ్ళింది. అక్కడ వైద్యులు పరిక్షించిన తరువాత అదేరోజు విజయనగరం ఎం.ఆర్ ఆసుపత్రికి రిఫర్ చేసారు. మంగళవారం తెల్లవారు జామున నీలిమ మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు శ్రీను, సాయమ్మ, గ్రామస్థులు దు:ఖసాగరంలో మునిగారు.జన్యుపరమైన లోపకారణంగా రక్తహీనత: నీలిమ మొదటి నుంచి జన్యుపర లోపం కారణంగా రక్తహీనత సంబందిత వ్యాధితో బాధపడుతుందని మెంటాడ పి.హెచ్.సి.వైద్యాధికారి ప్రియాంక, వసతిగృహ సంక్షేమ అధికారి తెలిపారు.



## విద్యార్థులకు టీకాలు

గరివిడి: ఆట్లు, రుబెల్లా వ్యాధులు రాకుండా మండలంలో గదబవలసలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం టీకాలు వేసాము. పాఠశాల హెచ్.ఎం. ఎన్.బలరాం మాట్లాడుతూ తొమ్మిది నెలలు నుండి 15 సంవత్సరాల లోపు ప్రతీ ఒక్కరు ఈ టీకాలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

## భారంగా మారిన నిత్యావసరాలు

రావికమతం : బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు పేదలకు తక్కువ ధరకు సరుకులు అందించేందుకు అమలు చేస్తున్న ప్రజాపంపిణీ వ్యవస్థను తెలుగుదేశం ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. తెల్లరేషన్ కార్డులు చంద్రబాబుపాలనలో తెల్లబోతున్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ కేవలం బియ్యానికే పరిమితమైపోయింది.

గత ప్రభుత్వం తొమ్మిది రకాల సరుకులు పంపిణీ చేసింది. చంద్రబాబు పాలన బియ్యం, పంచదార, కిరోసిన్‌కే పరిమితమైయింది. రెండు నెలల నుంచి పంచదార, కిరోసిన్‌ను రద్దు చేసింది. రూ.185లకు తొమ్మిది రకాలు నిత్యావసర సరుకులు అందజేస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు ఆ వాగ్ధానాన్ని గాల్లో కలిపేశారు.పంచదార, కిరోసిన్‌ను కూడా రద్దు చేయడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆగస్టు నెలలో ఏఏవై, అన్నపూర్ణ కార్డులకు మాత్రమే కిలో పంచదార చొప్పున అందజేయనున్నారు. బహిరంగ మార్కెట్లో ధరలు ప్రభుత్వ నియంత్రణలోకి రాలేదు. దీంతో పెద్ద మొత్తంలో ధరలు చెల్లించి సరుకులు కొనలేక పేదలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్లాడుతున్నారు.

కొందరు రేషన్ దుకాణాల నుంచి బియ్యం తీసుకోవడం లేదని ప్రభుత్వం గుర్తించింది. అలాంటి వారు తమకు బియ్యం వద్దని చెబితే బియ్యం సబ్సిడి సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం, రేషన్ దుకాణాలను విలేజ్‌మాల్స్‌గా మార్చాలనే ప్రభుత్వ యోజన ప్రస్తుతానికి వాయిదా పడినట్లు తెలిసింది.

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM I ADDL., DISTRICT JUDGE AT SRIKAKULAM.

M.V.O.P.121/2017

Between
Unkili Ammayamma and another ...Petitioners
And
Dandamudi Murali Krishna and 2 others ...Respondents

NOTICE

To
R1
Dandamudi Murali Krishna,
S/o Subbarao, Hindu, aged 35 years,
Owner of the Lorry bearing No.AP-28/X-6161,
Residing at Door No-6-86, BMPS Road, SER Centre,
Prasadampadu, Vijayawada, Krishna-521108

Please take notice that the above matter is posted to **23.08.2017 at 10.30 A.M.** for your notice to appear before the hon'ble court either in person or through an advocate for filing your counter if any failing which the matter will be heard in your absence.

L.GOVINDA RAJULU
ADVOCATE FOR THE PETITIONER
SRIKAKULAM

Srikakulam
Dated 12.07.2017

# ముద్రగడకు మద్ధతుగా కొవ్వొత్తుల ప్రదర్శన



ఆలమూరు : మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంకు మద్ధతుగా మండల కేంద్రం ఆలమూరులో మంగళవారం శ్రీకృష్ణదేవ రాయ కాపు అభ్యుదయ సంఘం మండల అధ్యక్షుడు రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

ఈ సందర్భంగా కాపులను బి.సి.లలో చేరుస్తానని చంద్రబాబు నాయుడు యిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలనే నినాదాలతో గ్రామ ప్రధాన వీధులగుండా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలమూరు గ్రామ శ్రీకృష్ణదేవ రాయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా సత్యనారాయణ (నానాజీ), కార్యదర్శి ఎలుబండి సాయిబాబు, కాపు నాయకులు చల్లా భూషణం, పురుషోత్తం వీర్రాజు, చిన్నం హరిబాబు, ఎలుబండి వెంకన్న, చల్లా భాస్కరరావు, తాకాసి సత్తిబాబు, కొమ్మిశెట్టి చిన్న, కోలా నాని, చిన్నం వీర్రాజు, కొటికలపూడి నాని తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యక్రమాలన్నీ ప్రజలకు చేరువలో ఉండాలి

**- ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి**

***మీకోసం వెబ్ సైట్ ప్రారంభం ...1100 టోల్ ఫ్రీ***




కాకినాడ : ప్రభుత్వ కార్యక్రమాలన్నీ ప్రజలకు చేరువలో ఉండాలనే ఉద్దేశంతో మీకోసం వెబ్ సైట్‌ను జిల్లాలోనే ప్రప్రధమంగా ఆన్‌లైన్‌లో వివరాలు తెలుసుకొనేందుకు ఈ సైట్‌ను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీకోసం వెబ్ సైట్ ద్వారా నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పధకాల వివరాలు, ఏవిధమైన సమాచారం, పిర్యాదులు, దరఖాస్తులు పింఛన్, రేషన్ కార్డులు వంటి పధకాల కోసంధరఖాస్తు చేసుకొన్నా వారికి రశీదులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఫోన్ ద్వారా పిర్యాదులు చేసుకోవడానికి 1100 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయవచ్చన్నారు.ఈ మాద్య మాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మె ల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు.



**దొండపర్తి ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గత మూడేళ్ళలో చేసిన అభివృద్ధి పనులను ముద్రించిన కరపత్రాలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ కమిటీ నాయకులు గంట్యాడ శంకరరావు, వంకర ఆనంద్‌ల ఆధ్వర్యంలో విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, ఎస్సీ నాయకులు ముక్కి రామకృష్ణ, పెద్దాడ పైడిరాజు, ఎ. వెంకటేశ్వరరెడ్డి, మజ్జి కోటేశ్వరరెడ్డి, పి మోహన్, ముత్యాల మురళి, బంగారు రవిశంకర్, జి. శాంతకుమారి, ఇ. ప్రసాద్ పాల్గొన్నారు.**

# రిజర్వ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

యానాం : పశ్చిమబంగల్‌లోని జలపాయిగురి 46వ బెటాలియన్‌లో రిజర్వ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కొప్పుశెట్టి శ్రీనాగప్రసాద్ యానాం రాజీవ్‌గాంధీ బీచ్‌లోని ఎన్ఎసి జెట్టీ వద్ద ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం ఆ ప్రాంతానికి వాక్‌వే చేస్తున్నవారు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృత దేహం ప్రక్కన ఉన్న బ్యాగ్‌లో ఉన్న డైరీలో అతని వివరాలు లభించాయి. వాటి ఆధారంగా అతనిది ముమ్మిడివరం మండలం ఐనాపురం గ్రామంగా గుర్తించారు. అతని కుటుంబ సభ్యులకు ఎస్ఐ శివకుమార్ సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసు తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 22 వరకు సెలవుపై 10 రోజుల క్రితం ఇంటికి వచ్చిన శ్రీనాగప్రసాద్ అప్పుచేసి కొంత పొలం, ద్విచక్రవాహనం కొనుగోలు చేసాడు. ఈ విషయంలో అతనికి తల్లిదండ్రుల మధ్య వాగ్వివాదం జరిగింది 30 ఏళ్ళు వచ్చిని ఎందుకు పెళ్ళిచేసుకోవడంలేదని పెళ్ళిచేసుకుంటే కట్న కానుకుల రూపంలో సదరు వస్తువులు వస్తాయని కోపడటంతో ఇంటినించి శుక్రవారం వెళ్ళిపాయాడు. కాకినాడలోని బంధువుల ఇంటికివెళ్ళి ఆదివారం రాత్రి ఇంటికి ఫోన్‌చేసి తాను జలపాయిగురి వెళిపోతున్నట్లు తెలిపాడు. తరువాత యానాం ఎన్ఎసి జెట్టి వద్ద శవం అయ్యి కనిపించాడు మృతదేహం పక్కన శీతలపానియం సీసా ఉండటంతో పురుగులు మందు అందులో కలుపుకొని ఆత్మహత్యకు పాల్పడిఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

మృత దేహాన్ని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిం చారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ వి. శివకుమార్ తెలిపారు.

# వినియోగంలోకి సంధిపూడి ఆర్వో వాటర్ ప్లాంటు

ఆలమూరు : మండల పరిధి సంధిపూడి గ్రామంలో ఎన్.టి.ఆర్ సుజల పధకంలో ఏర్పాటు చేసిన ప్లాంటులో త్రాగునీటిని శుద్ధిచేసే ఫిల్టర్లు గత 3నెలలు క్రితం పాడైపోయాయి. దీనిపై పంచాయితీ పాలకవర్గం ఆర్.డబ్ల్యు.ఎస్. దృష్టికి తీసుకువెళ్ళినా ఫలితం లేకపోయింది శుద్ధి త్రాగునీటికి అలవాటు పడిన గ్రామస్తులు ఇతర గ్రామాలకు వెళ్ళి త్రాగునీటిని తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో స్పందించిన సర్పంచ్ యెరుబండి నాగమణి బుజ్జి సుమారు రూ. 70వేలు పంచాయితీ నిధులు వెచ్చించి, నిపుణులతో మరమ్మత్తులు చేపట్టి, మంగళవారం ఈ ప్లాంటును వినియోగంలోకి తీసుకువచ్చారు.

# వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ తరుపున

**బెండా విష్ణుమూర్తి నామినేషన్**



కాకినాడ : వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ తరుపున బెండా విష్ణుమూర్తి నామినేషన్ 35వ డివిజన్ అభ్యర్ధిగా నామినేసన్ దాఖలు చేశారు.తన అనుచరగణంతో నామినేషన్ కేంద్రానికి వచ్చి రిటర్నింగ్ అధికారి మధుసూదనరావుకు నామినేషన్ పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆశయసాధనకోసం ఏర్పడిన వైఎస్ఆర్ పార్టీ తరుపున పోటీచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో మోసపూరిత తెలుగు దేశం పాలనతో ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారని, తెలుగుదేశం గత మూడేళ్ళ పాలనలో ప్రకటనలు, ప్రలోభాలతో ప్రజలను మభ్య పెట్టిందే గానీ ప్రజలకు ఏవిధమైన అభివృద్ధికి చేయలేదన్నారు. కాకినాడ నగర పాలక సంస్థలో వైఎస్ఆర్ పార్టీ విజయ బావుటా ఎగుర వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాశి విశ్వేశ్వరరావు, సంద్రాని శ్రీనివాస్, ఏడుకొండలు, బొర్రా పెద్ద , చొచ్చుపట్ల రాజు, ముమ్మిడి చిన్న తదితరులు పాల్గొన్నారు.

# సీతారాములను దర్శించిన పదిలం బృందం



విజయనగరం : విజయనగరం జిల్లా రామతీర్ధం సీతారాముల వార్ని గ్రామీణ వైద్యుల ఫెడరేషన్ పదిలం.బెన్నబాబు బృందం దర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో ఆలయ అధాకారులు స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల మహదాశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజక సిద్దార్ద సెక్రటరీ కరెళ్ళ.గణపతిరావు అచ్చిరెడ్డి, ఐ.గోపి, ఉపేద్రరెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రచార భాగస్వామ్యంతోనే స్వచ్ఛభారత్

**జోనల్ కమీషనర్**

భీమునిపట్నం : భీమునిపట్నం జోనల్ పరిధిలో గల ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో శతశాతం స్వచ్ఛభారత్ సాధ్యపడుతుందని జోనల్‌కమీషనర్ బి. సన్యాసినాయుడు అన్నారు. జోనల్ కార్యాలయం విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్ నిర్వాహణలో జివిఎంసికి 3వ స్థానం ఆక్రమించడం గర్వించదగ్గ విషయం అని అన్నారు. జోనల్ స్థాయిలో మరింత పటిష్టంగా అమలుపరిచేందుకు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రజలు తమ ఇండ్ల నుండి వచ్చే చెత్తను తడి, పొడి గా వేరుచేసి తోపుడు బండ్లుకు అప్పగించాలని కోరారు. స్వచ్ఛభారత్‌పై అవగాహన కోసం విద్యాసంస్థలు విద్యార్థులు ఉపాధ్యాయులు సహకారంతో విరివిగా సదస్సులు నిర్వహించాలని కమీషనర్ తెలిపారు.

# తడిచెత్త, పొడిచెత్త డస్టబిన్స్ పంపిణి



భీమునిపట్నం : మండలం కె. నగరపాలెం పంచాయతీ సర్పంచ్ గరికిన సుధ, ఎంపిటిసి పోతిన శివకుమార్ ఆధ్వర్యంలో కె. నగరపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలలో డస్టబీన్స్ పంపిణీచేసి తడి, పొడి చెత్తను వేరువేరుగాడస్టబిన్స్‌లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి గరికిన ఎల్లయ్య, కరుణాకర్ సాంబ గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు

# ఘనంగా జరిగిన విజయనగరం జిల్లా గ్రామీణ వైద్యుల సమావేశం



విజయనగరం : విజయనగరం జిల్లా గ్రామీణ వైద్యుల సమావేశం క్వీన్స్ ఎన్ఆర్ఐ హస్పటల్ నందు అత్యంత ఘనంగా జరిగింది. ఈ సమావేశంకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజా.సిద్దార్ద సెక్రటరీ కరెళ్ళ.గణపతిరావు ఆర్గనైజేషన్ సెక్రటరీ యల్ అచ్చిరెడ్డి ఫెడరేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పదిలం.బెన్నబాబు హాజరైనారు. ఈ కార్యక్రంలో రాజా.సిద్దార్ద కరెళ్ళ.గణపతిరావు మాట్లాడుతూ ప్రతీ గ్రామీణ వైద్యుడు తమ పరిమితికి మించిన వైద్యము చేయరాదని తమ పేర్ల ముందు డాక్టర్ అనే పదాన్ని వాడరాదని సభ్యులకు సూచించారు.ప్రతీ సభ్యుడు ప్రాథమిక వైద్యము చేసి తదుపరి వైద్యము కొరకు తమ దగ్గరలో ఉన్న గవర్నమెంట్ ఆసుపత్రికి సిఫార్సు చేయాలని అదే విధంగా త్వరలో గుంటూరులో జరిగే గ్రామీణ వైద్యుల మహ సభకు ప్రతీ సభ్యుడు తరలిరావాలని సూచించారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర జోనల్ సెక్రటరీ జంగం.జోషి ఉత్తరాంధ్ర కన్వీనర్ ఐ.గోపి విజయనగరం జిల్లా అధ్యక్షుడు జి.చిరంజీవి,ఊటనల్లి.గోపి,ఫెడరేషన్ జోనల్ మెంబర్ ఆర్.సూర్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జోనల్ సెక్రటరీ జంగం.జోషి మాట్లాడుతూ ఈ గ్రామీణ వైద్యుల మహ సభకు సుమారు 400 మంది హజరైనారని తెలిపారు.

# 10న క్రైస్తవుల శాంతియుత భారీ ర్యాలీ



విశాఖపట్నం : దళిత క్రైస్తవులకు ఎస్సీ,ఎస్టీ హెూదా కల్పించాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన దేశవ్యాప్తంగా బ్లాక్ డేగా ప్రకటిస్తూ జీవిఎంసీ గాంధీ విగ్రహం నుండి భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు క్రిష్టియన్ మైనార్టీ జాయింట్ యాక్టివ్ కమీటి అధ్యక్షుడు మోఖన అనిల్ పాల్ తెలిపారు. వీజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఉన్న 1950లోని 3వ పేరాను నిరసిస్తూ క్రైస్తవ హక్కులు, దాడులు, అత్యాచారాలు, క్రైస్తవ స్థలాలు ఆక్రమించుట వంటి వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ క్రైస్తం సంఘాలన్నీ ఐక్యంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నామని, జివిఎంసి నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. క్రైస్తవుల పై ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని అన్నారు. పార్థిక శవాన్ని పూడ్చడానికి కూడా స్థలాలు లేని దుర్భర పరిస్థితిలో వున్నామని, తక్షణమే స్థలాలు కేటాయించాలని కోరారు. దేశంలో దళీతులు, క్రైస్తువుల పట్ల అమానుషంగా దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లాబత్తుల వెంగళరావు, శామ్యల్, లాల్ మానాజీ, అబీల్ పాల్గొన్నారు.

# పరంపేటలో ఏరులైపారుతున్న నాటుసారా

యానాం : పరంపేట గ్రామంలో అక్రమనాటు సారా అమ్మకాలు ఏరులై పారుతుందని గ్రామస్తులు ఆరోపించారు. ఐలాండ్ భూముల్లో తయారైన అక్రమ నాటుసారా నదీమార్గాల వెంబడి రవాణా చేసుకుంటూ పరంపేట గ్రామంలోని ఆడబడుచుల కాలనీ, ఏటిగట్టు రోడ్డుమార్గంలో సుమారు ఆరుగురి ఇళ్ళవద్దే నాటుసారా అమ్మకాలు సాగిస్తున్నారు. ఏళ్ళతరబడి ఈ అమ్మకాలు సాగుతున్నా వీటిని నియంత్రించే పరిస్థితులు కనిపించడంలేదని మహిళలు వాపోయారు. నాటుసారా వలన అనేక మంది మద్యం ప్రియులు చనిపోయిన ఘటనలు పలు గ్రామాల్లో చోటు చేసుకుంటున్నా వీటీని అరికట్టడంలో ఎక్సైజ్, పోలీసు శాఖలు విఫలమవుతున్నారని ఆరోపించారు. మరోపక్క ప్రభుత్వ కోపరేటివ్ షాపులద్వారా బ్రాంది అమ్మకాలు చేయడానికి ఏర్పాటుచేసిన సిబ్బంది నాటుసారా అమ్మకపుదారులతో కుమ్మక్కయి రూ.35 లకు నిబ్ అమ్ముకోగా నాటు సారా అమ్మకపుదారుల దానిని రూ. 60 అమ్మకాలు చేస్తున్నారు. కొపరేటివ్ బ్రాంది షాపులో కేటాయించిన మద్యం రెండురోజులకే లేకపోవడం జరుగుతుందని ఆరోపించారు. కోపరేటివ్ సిబ్బంది బ్రాంది అమ్మకాలు చేయవలసి ఉన్నప్పటికీ వీరు అమ్మకుండా అక్రమ నాటు సారా అమ్మకపుదారులతో అమ్మకాలుచేయుస్తూ లాభాలు గడిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఎక్సైజ్, పోలీసు అధికారులు సమగ్ర దర్యాప్తుచేసి నాటు సారా అమ్మకాలు అరికట్టాలని కోపరేటివ్ మద్యం దుకాణాలో జరుగుతున్న అవకతవకలపై, అక్రమవసూలపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సాయంత్రం నుండి తెల్లవార్లు ఈ అమ్మకాలు జరుగుతున్నాయిని ఆరోపించారు. వీటిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

# టిల్లపూడికి మాతృ వియోగం



తాళ్లరేవు : తాళ్లరేవు వైఎస్ఆర్ సిపి కన్వీనర్ టిల్లపూడి నాగేశ్వరరావుకు మాతృవియోగం కలిగింది మంగళవారం ఉదయం సుంకరపాలెం లోని ఆయన స్వగృహంలో తెల్లవారుజామున టిల్లపూడి సత్యవతి లేచి బాతురూంకు వెళ్ళివచ్చి ఒక్కసారిగా కళ్ళుతిరిగి పడిపోగా ఆమెను మంచంపై పడుకోబెట్టి చూసేసరికి చనిపోయి నట్లు నిర్ధారించారు. పల్స్‌రేటు ఒకసారిగా పడిపోవడంతో మృతి చెందినట్లు టిల్లపూడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఎటువంటి అనారోగ్యం లేకపోయినప్పటికీ అందరితో కలసిమెలసి ఉండే ఆమె మృతిచెందడం కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోయారు. దీంతో ఆ కుటుంబం షాక్‌కు గురైంది. సంవత్స రం క్రితం మృతిరాలి మనవడు మృతిచెందడం దగ్గరగా ఈ ఘటనలచోటు చేసుకోవడం సభ్యులను కలచివేసింది. స్థానిక కనకాలపేట శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# 13 నుండి ఆనందో బ్రహ్మ వార్షికోత్సవాలు

యానాం : ఈనెల 13 నుండి 15 వరకు యానాం అగ్నికులక్షత్రియ కల్యాణ మండపంలో 4వ ఆనందో బ్రహ్మ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ధ్యానమందిర మాస్టర్ టేకుమూడి వెంకటరావు తెలిపారు. పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు స్పిరిట్యూవల్ టేబ్‌లెట్స్ వారి విశేష సహకారంతో మూడు రోజులపాటు జగద్గురు బ్రహ్మర్షి పత్రీజీ పర్యవేక్షణలో ఆనందోబ్రహ్మ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 13వ తేదీన ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు జగద్గురు బ్రహ్మర్షి పత్రీజీ వేణు గానం 7 గంటల నుండి 8 వరకు, డాక్టర్ గోపాల్‌కృష్ణచే స్పిరిట్యూవల్ టేబ్‌లెట్స్‌పై వివరణ 8 నుండి 9 వరకు, ఆధ్యాత్మిక అనుభవాలు 9 నుండి 1 వరకు, స్పిరిట్యూవల్ టేబ్‌లెట్స్ ఆత్మ సౌందర్యం, ధ్యాన మాతృత్వం స్పిరిట్యూవల్ అడ్మినిస్ట్రేషన్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యోగా వలన కలిగే లాభాలు వాటి అనుభవాలు వివరిస్తారన్నారు. యోగా సాధనవలన కలిగే ప్రయోజనాలు తెలుసుకొనేందుకు తరలిరావాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సందర్భంగా సంగీత ధ్యానం, బ్రహ్మర్షిపత్రీజి సందేశం, సినీప్రముఖుల శాఖాహార, ధ్యాన సందేశాలు, ఆధ్యాత్మిక అంశాలతో సంగీత, నృత్య కార్యక్రమాలు స్పిరిట్యూవల్ టేబ్‌లెట్స్, సినీఆనంద, హాస్య, వినోద వల్లరి, ఆధ్యాత్మిక పుస్తకప్రదర్శనలు, ఆటలు, పాటలు, మరియు నృత్యపోటీలు, సేత్ ధ్యాన మాతృత్వం మరియు అకాడమి శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

# చిత్రభాను

# త్రిష పంచ్!

బాక్సర్‌గా అవతారమెత్తింది త్రిష. ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపించడానికి సిద్ధమవుతున్నది. తనను ఓడించడం కలలో కూడా సాధ్యం కాదని ఛాలెంజ్ విసురుతున్నది. గత కొంతకాలంగా ప్రయోగాత్మక చిత్రాలపై ద ృష్టిసారిస్తున్న ఈ సొగసరి ప్రస్తుతం బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నది. శిక్షకుడితో కలిసి ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నది. ప్రొఫెషనల్ బాక్సర్ తరహాలో త్రిష పంచ్‌లను సంధిస్తున్న ఈ వీడియోసామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ప్రస్తుతం బాక్సింగ్ తనకు ఓ వ్యసనంగా మారిపోయిందని, ఈ ఆటతో ప్రేమలో పడిపోయానని చెబుతున్నది. తనను ఓడించాలని కలగన్నా అది మీకు సాధ్యం కాదు. వెంటనే మెల్కొని నన్ను క్షమాపణలు కోరుకోండి అంటూ ట్వీట్ చేసింది. ప్రస్తుతం తమిళ, మలయాళ భాషల్లో అరడజనుకుపైగా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నది త్రిష.



## బాలకృష్ణపై శ్రీయా సెన్సేషనల్ కామెంట్స్..



దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒక వెలుగు వెలిగిన శ్రీయా సరన్ కొన్నాళ్లుగా ఆ మెరుపులు మెరిపించడం లేదు. కానీ తాజాగా ఆమె అంగీకరించిన సినిమాలు చూస్తే ఆమె కెరీర్ మళ్లీ గాడిన పడినట్టు కనిపిస్తున్నది. నటసింహ బాలకృష్ణ 100వ చిత్రంగా ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకొన్న గౌతమిపుత్ర శాతకరి? చిత్రంలో ఆమె వశిష్ఠదేవిగా తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. ఆ చిత్రం తర్వాత మళ్లీ బాలకృష్ణ చిత్రంలో నటించే అవకాశాన్ని చేజిక్కించుకొన్నది. శ్రీయా సరన్ నటిస్తున్న తాజా చిత్రం పైసా వసూల్. ఈ చిత్రం ద్వారా మరోసారి బాలకృష్ణ సరసన నటిస్తున్నది. పైసా వసూల్ చిత్రంలో జర్నలిస్టుగా శ్రీయ కనిపించనున్నది. జర్నలిస్టుగా పనిచేసే తాను బాలక ృష?ను ఎలా కలిశానన్నదే తన పాత్ర నేపథ్యం అని ఇటీవల శ్రీయా సరన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఈ చిత్రానికి పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. వంద చిత్రాల్లో నటించి ప్రేక్షకుల హ ృదయాల్లో చోటు సంపాదించకొన్న బాలక బాలకృష్ణతో నటించడం నా అద ృష్టం. అంతేగానీ నేను నటించడం వల్ల ఆయన సినిమాలు బాగా ఆడుతున్నాయి అనే ప్రశ్న సరికాదు. నేను ఈ ఏ హీరోకు కూడా లక్కీ హీరోయిన్ కాదు. బాలక ృష?నే నాకు లక్కీ హీరో. ఆయనతో నటించిన సినిమాలన్నీ ఘన విజయం సాధించాయి అని శ్రీయ సరన్ పేర్కొన్నది. బాలకృష్ణతో నటించడం ఇది మూడోసారి. ఆయనతో నటించిన అన్ని చిత్రాలు ఘన విజయం సాధించాయి అని ఆమె అన్నారు. పూరీ జగన్నాథ్ గురించి శ్రీయ సరన్ మాట్లాడుతూ.. దక్షిణాదిలో మంచి దర్శకుల్లో పూరీ ఒకరు. చాలా మంది కొత్త దర్శకులతో పనిచేసిన అనుభవం ఉంది. ప్రతి ఒక్కరు నన్ను తెరమీద అదు్భతంగా చూపించారు. పైసా వసూల్ చిత్రంలో తన పాత్రను పూరీ జగన్నాథ్ అద్భుతంగా డిజైన్ చేశారు అని చెప్పారు.

# సితార మెచ్చిన పాట



మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం స్పైడర్‌లోని బూమ్ బూమ్ అనే పాటను ఇటీవలే విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ గీతం సంగీతప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నది. మహేష్‌బాబు గారాలతనయ సితారకు కూడా ఈ పాట బాగా నచ్చిందట. పదేపదే ఈ పాటను వింటూ ఎంజాయ్ చేస్తున్నదట. ఈ విషయాన్ని మహేష్‌బాబు ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న సితార బూమ్ బూమ్ పాటను వింటూ, హమ్ చేస్తూ సంబరపడిపోతున్న వీడియోను మహేష్‌బాబు ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. సితార ఈ పాటను రిపీట్ మోడ్‌లో పెట్టుకొని పదేపదే వింటున్నది. తనకు నచ్చిన కొత్త పాట ఇది అంటూ మహేష్‌బాబు వ్యాఖ్యానించారు. తెలుగు, తమిళ భాషల్లో మురుగదాస్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతున్నది. ఒక పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. సెప్టెంబర్ 27న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# వావ్..! రమ్యకృష్ణ ఇప్పటికీ

రమ్యకృష్ణ ఒకప్పటి టాలీవుడ్ గ్లామర్ క్వీన్, అప్పట్లో రమ్యకృష్ణని కేవలం గ్లామర్ గానే కాదు ఆహ్వానం లాంటి సినిమాల్లో కూడా రమ్య అందానికి దాసోహం అన్నారు. బాహుబాలిలో శివగామి పాత్రతో యవత్ భారతదేశ సినిమా ప్రేక్షకులని ఆకట్టుకోని లేటు వయస్సులో ఎందరో అభిమానులని కూడగట్టుకుంది రమ్యకృష్ణ. ఆ ఒక్క సినిమా చాలు రమ్యకృష్ణకి ఇంకా అన్ని ఇండస్ట్రీలలో తిరుగులేకుండా చెయ్యడానికి. దక్షిణాదిన క్యారక్టర్ ఆర్టిస్టుల్లో అత్యంత రెమ్యూనరేషన్ తీసుకుంటున్న నటిగా కూడా రమ్యకృష్ణ ఇప్పుడు నిలిచింది అంటే దీనంటటికి కారణం ఒక్క బాహుబలి సినిమానే అని చెప్పుకోవచ్చు.. హీరోయిన్ గా ఒక వెలుగుతున్న సమయంలో 'నరసింహ' వంటి సినిమాలో రజనీకాంత్ లాంటి హీరోకి దీటైనా పాత్రలో నటించి అప్పట్లోనే అందరి నుండి మంచి ప్రశంసలు అందుకుంది రమ్య. కేవలం నటన విషయంలోనే కాదు.. గ్లామర్ విషయంలో కూడా రమ్యకృష్ణ వన్నె తగ్గలేదు.ఇక లేటెస్ట్ గా ఆమె జే ఎఫ్ డబ్ల్యూ మేగజైన్ ముఖచిత్రంపై మెరిసింది. ఈ మేగజైన్ ముఖచిత్రం పై ఆమె లుక్ ను .. ఇచ్చిన స్టిల్ చూసిన వాళ్లంతా 'వావ్' అంటున్నారు. 46 సంవత్సరాల వయసులోను ఆమె ఇంత గ్లామరస్ గా కనిపిస్తూ ఉండటం రియల్లీ గ్రేట్ అంటున్నారు. చిరంజీవి .. బాలకృష్ణ .. వెంకటేశ్ వంటి సీనియర్ కథానాయకుల సరసన కూడా మళ్లీ కథానాయికగా అలరించేంత గ్లామర్ ఆమె సొంతమని చెప్పుకుంటున్నారు. అలా జరిగే అవకాశం కూడా లేకపోలేదు. తల్లి పాత్రలు చేస్తున్నా, నయా హీరోయిన్లకు పోటీ ఇచ్చేంత గ్లామరస్‌గా కనిపిస్తోంది రమ్య. ఇటీవలే నాగార్జున సరసన ఒక హీరోయిన్‌గా నటించి.. ఆ సినిమాలోని అరడజను మంది అమ్మాయిలకు పోటీని ఇచ్చిన రమ్య.. సీనియర్ హీరోల సరసన చక్కగా అమరేలా ఉంది ఈ లుక్‌లో.



# ఆరేళ్లు టార్చర్ అనుభవించా

సాధారణ మహిళలు మాత్రమే కాదు... సెలబ్రిటీలు సైతం గ ృహ హింస, వేధింపులకు గురవుతున్న సంఘటనలు అనేకం. ఈ పరిణామాలు చివరకు విడాకులకు దారి తీస్తున్నాయి. ఇలాంటివి ఎదుర్కొన్న సెలబ్రిటీల్లో ప్రముఖ తెలుగు సింగర్ కౌసల్య ఒకరు. కౌసల్య తన చిన్న నాటి స్నేహితుడిని ఇష్టపడి పెళ్లాడింది. పెళ్లయిన తర్వాత అతడి నుండి వేధింపులు ఎదురవ్వడంతో పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చినా అతడి తీరు మారలేదు. అలాంటి వ్యక్తితో జీవించడం కంటే విడిపోవడమే బెటర్ అని నిర?యించుని తెగదెంపులు చేసుకున్నారు. ప్రస్తుతం కౌసల్య తన కుమారుడితో ఉంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె తన విడాకుల అంశంపై స్పందించారు. నేను ఏదో క్షణికావేశంలో విడాకులు తీసుకోలేదు. వైవాహిక జీవితంలో దాదాపు ఆరేళ్లు టార్చర్ అనుభవించాను. అంతకు మించి భరించడం నా వల్ల కాలేదు. అందుకే విడాకులు తీసుకోవాల్సి వచ్చిందని కౌసల్య తెలిపారు.పెళ్లైన పదహారు రోజులకే భర్త కొట్టాడు. అందరి ముందు తీవ్రమైన అసభ్య పదజాలం ఉపయోగించి తిట్టేవాడు. అతడి ప్రవర్తన చూసి అతడి పేరెంట్స్ కూడా షాకయ్యేవారు. వారి ఫ్యామిలీలో ఎవరికీ లేని తిట్టడం, కొట్టడం లాంటి అలవాట్లు ఇతడికి ఎలా వచ్చాయని బాధపడే వారు అని కౌసల్య తెలిపారు. అతడితో కలిసి ఉన్నంత సేపు స్వేఛ్ఛ ఉండేది కాదు. నా ఇష్టాలతో సంబంధం లేకుండా అతడి ప్రవర్తన ఉండేది. నేను చీరకట్టుకునే విషయంలో, చివరకు బొట్టు పెట్టుకునే విషయంలో కూడా అలా, ఇలా అని చెప్పేవాడు. అయినా సరే సర్దుకుపోయాను. ఆ వేధింపుల మధ్య, హింస మధ్య ఉండటం నా వల్ల కాలేదు, అందుకే విడిపోవాల్సి వచ్చింది అని కౌసల్య తెలిపారు. నా విషయంలో ఎన్ని చేసినా భరించాను. కానీ కొడుకు విషయంలో కూడా బాధ్యతగా ఉండేవాడు కాదు. అలాంటి వ్యక్తితో ఉండటం కంటే విడిపోవడమే మంచిదని నిర?యించుకున్నట్లు కౌసల్య తెలిపారు. నాతో ఉన్నప్పటి నుండే వేరే మహిళతో సంబంధం పెట్టుకున్నాడు. వారికి సంబంధించిన వార్తలు కూడా



చాలా విన్నాను. ఓ సారి నా కొడుకు వారిని స్వయంగా చూశాడు. విడిపోవడానికి ఇంతకు మించిన కారణం అవసరం లేదని కౌసల్య తెలిపారు.

## డ్రగ్స్ కేసు దర్యాప్తులో

# మీ పరిధి ఎంత?

### వారంలోగా చెప్పాలని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన డ్రగ్స్ కేసుల్ని దర్యాప్తు చేసేందుకు ఆబ్కారీ శాఖకు అధికార పరిధి ఏమిటో వారంలోగా తెలపాలని హైకోర్టు ఆదేశించింది. డ్రగ్స్ వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థల పర్యవేక్షణలో జరపాలని కోరుతూ తెదేపా నేత రేవంత్‌రెడ్డి దాఖలుచేసిన వ్యాజ్యంపై ఉన్నత న్యాయ స్థానం మంగళవారం విచారించింది.

సిట్ దర్యాప్తు సంతృప్తికరంగా లేదని రేవంత్ తరఫు న్యాయవాది రచనారెడ్డి వాదించారు. ఎక్సైజ్‌శాఖకు మత్తుమందులు నియంత్రించే అధికారం ఉన్నా నిందితుల్ని ప్రాసిక్యూషన్ చేయలేదని, ఇతర రాష్ట్రాలు, దేశాల్లో విచారణ చేపట్టలేదని ఆమె వాదించారు.

ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం ఎక్సైజ్ శాఖకు దర్యాప్తుచేసే అధికారం ఉందని ప్రభుత్వ న్యాయవాది శరత్ న్యాయస్థానానికి తెలిపారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయస్థానం ఏ చట్టం ప్రకారం, ఎంతవరకు విచారించే అధికారం సిట్‌కు ఉందో వారంలోగా తెలపాలని ఎక్సైజ్‌శాఖను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

## నాకు, కోహ్లీకి మధ్య పోలికే లేదు



కరాచీ: భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీకి.. తనకు ఏమాత్రం పోలిక లేదని పాకిస్థాన్ యువ క్రికెటర్ బాబర్ అజామ్ పేర్కొన్నాడు. కోహ్లీ గొప్ప బ్యాట్స్‌మెన్ అని, తాను ఇంకా కెరీర్ ప్రారంభంలోనే ఉన్నానని అజామ్ తెలిపాడు.

కొద్ది రోజుల క్రితం అజామ్ ఓ క్రీడా ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ప్రపంచంలోనే నంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా ఎదగాలన్నది తన కోరిక అని తెలిపాడు. ఇదిలా ఉండగా ట్విటర్‌లో అజామ్ అభిమానులతో స్వయంగా ఛాటింగ్‌లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఓ అభిమాని మీ అభిమాన ఆటగాడు ఎవరని అడగ్గా ఏబీ డివిలియర్స్, విరాట్ కోహ్లీ, హషీమ్ ఆమ్లా అని తెలిపాడు. తాను క్రికెట్‌ను ఎంచుకునేందుకు తన అంకుల్ కారణమని.. ఆయనతో కలిసి వీధుల్లో క్రికెట్ ఆడిన సంఘటనలు ఇంకా గుర్తు ఉన్నాయని ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు అజామ్ సమాధానం ఇచ్చాడు.

అనంతరం మరో అభిమాని అజామ్‌ను పాకిస్థాన్ కోహ్లీగా పిలవచ్చా అని అడగ్గా.. మా ఇద్దరి మధ్యా పోలికే లేదు. కోహ్లీ గొప్ప బ్యాట్స్‌మెన్. నేను ఇంకా కెరీర్ ప్రారంభంలోనే ఉన్నాను. పాకిస్థాన్ బాబర్ అజామ్‌గా పిలుపించుకోవడమే నాకు ఇష్టం అని అజామ్ పేర్కొన్నాడు. 22ఏళ్ల అజామ్ ఇప్పటివరకు పాక్ తరఫున 9 టెస్టులు, 31 వన్డేలు ఆడాడు.

## రవీంద్ర జడేజాకు

# నెంబర్ 1 ర్యాంక్...!



న్యూఢిల్లీ: ఐసీసీ టెస్ట్ ర్యాకింగ్స్‌లో టీమిండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా నెంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు. టెస్ట్ క్రికెట్ ఆల్‌రౌండర్ల విభాగంలో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్‌ను కిందికి నెట్టి అగ్రస్థానం సంపాదించాడు. జడేజా కెరీర్‌లో నెంబర్ వన్ ర్యాంకు దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం. కొలంబో వేదికగా భారత్, శ్రీలంక మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో జడేజా విశ్వరూపం చూపించిన సంగతి తెలిసిందే. 70 పరుగుల పదునైన బ్యాటింగ్‌తో అలరించిన జడేజా.. బౌలింగ్‌లోనూ సత్తా చాటి ఐదువికెట్లు పడగొట్టాడు. దీంతో రెండేళ్లలో ఐదోసారి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. గాలేలోనూ అద్భుత ప్రదర్శన కనబర్చిన ఈ సౌరాష్ట్ర స్టార్... ఇప్పటికే టెస్ట్ బౌలర్లలో నెంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు.

ఇక బ్యాటింగ్‌లోనూ 6 స్థానాలు మెరుగుపర్చుని 51వ ర్యాంకులోకి చేరుకున్నాడు.

## నోట్లు ఇచ్చేవారికి ఓట్లు వేయొద్దు : వెంకయ్య

నెల్లూరు: నోట్లు ఇచ్చేవారికి ఓట్లు వేయొద్దని విద్యార్థులకు ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఎం. వెంకయ్యనాయుడు ఉద్బోధించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. పాఠ్యాంశాల్లో నైతిక విలువలు చేర్చే అంశంపై ప్రధాని నరేంద్ర మోదీతో చర్చిస్తానని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని సాధించేందుకు కృషి చేయాలని ప్రోత్సహించారు.

తన స్వగ్రామం చవలపాలెంలోనూ ఆయన పర్యటించారు.

కమ్యూనిటీ హాల్, రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తామని ఆయన ఈ సందర్భంగా హామీయిచ్చారు. ఏ స్థాయిలో ఉన్నప్పటికీ పుట్టిన స్వగ్రామ అభివృద్ధిని మరువనని చెప్పారు.

## ఆనంద్‌కు తొలి విజయం



సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్విఫీల్డ్ కప్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తొలి విజయాన్ని నమోదు చేశాడు. ప్రపంచ ఐదో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన ఆనంద్ 29 ఎత్తుల్లో గెలుపొందాడు. తొలి నాలుగు గేమ్‌లను డ్రాగా ముగించుకున్న ఆనంద్ ఈ విజయంతో పాయింట్ల పట్టికలో సంయుక్తంగా రెండో స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే), ఆనంద్ ఖాతాలో మూడేసి పాయింట్లున్నాయి.

## కేంద్ర ప్రభుత్వం తక్షణమే కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలి

### కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్




గాజువాక: కేంద్ర ప్రభుత్వం తక్షణమే కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రవేటీకరణను ఆపాలని కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేసాయి. మంగళవారం న్యూఢిల్లీలోని టల్కటోరా ఇన్‌డోర్ స్టేడియంలో కేంద్ర కార్మిక సంఘాల జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో జాతీయ కార్మిక సంఘాలైన ఇంటక్, ఏ.ఐ.టి.యు.సి, సిఐటియు, హెచ్.ఎం.ఎస్, టి.యు.సి.సి, ఏ.ఐ.యు.టి.యు.సి, ఏ.ఐ.సి.సి.టి.యు, యు.టి.యు.సి, టి.యు.సి.సి, ఎస్.ఈ.డబ్ల్యూ.ఏ, ఎల్.ఎఫ్.ఎఫ్, నాయకులు ప్రతినిదులు పాల్గొన్నారు. ఈ జాతీయ సదస్సులో ఏ.ఐ.టి.యు.సి జాతీయ కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్, ఇంటక్ జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి, సి.ఐ.టి.యు జాతీయ నాయకులు తపన్‌సేన్, హెచ్.ఎం.ఎస్.జాతీయ నాయకులు సింగా ప్రసంగించారు. కార్మికులకు సంబందించిన 12 డిమాండ్లను తీర్మానించి ఆమోదించారు. కేంద్రరంగ పరిశ్రమలను కేంద్రంలోని భా.జ.పాప్రభుత్వం ప్రవేటీకరణకు కుట్ర పన్నుతుందని, ఇప్పటికే సెయిల్ లోని కొన్ని కార్మాగారాలను డిజిన్వెస్ట్‌మెంట్ చేసిందన్నారు. నెలకు రూ. 18000వేలు కనీస వేతనం ఉండాలని, ప్రతీ నెల రూ. 3000లకు తగ్గకుండా పెన్సన్ ఉండాలని, అలాగే బోనస్, పి.ఎఫ్, గ్రాట్యుటీపై సీలింగ్ ఎత్తివేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేసాయి. రైల్వేస్, ఇన్సూరెన్స్, డిఫెన్స్ రంగాలలో ప్రవేటీకరణ ఆపాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రతతోపాటు, షోషల్ సెక్యూరిటీ మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు.

లేని పక్షంలో నిరుద్యోగ భృతి కల్పించాలన్నారు. ఈ సదస్సుకు విశాఖ ఉక్కు కార్మాగారం నుంచి స్టీల్ ఏ.ఐ.టి.యు.సి అధ్యక్షులు జి.బోసు బాబు, ఉపాధ్యక్షులు జె.రామకృష్ణ, మాసేన్ రావు, నరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచకప్ ఆడాలన్నది నా కల



కోచి: 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణానికి సంబంధించి క్రికెటర్ శ్రీశాంత్‌పై జీవితకాల నిషేధాన్ని ఎత్తివేయాలని కేరళ హైకోర్టు బీసీసీఐని ఆదేశించిన సంగతి తెలిసిందే. కోర్టు తీర్పు సంతోషం వ్యక్తం చేసిన శ్రీశాంత్.. 2019 ప్రపంచకప్‌లో ఆడాలన్నది తన కల అని తెలిపాడు.

శ్రీశాంత్ ఓ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 2019 ప్రపంచకప్ ఆడాలన్నది నా కల. ఇది కష్టమని నాకు తెలుసు. కానీ ఏదో ఒక అద్భుతం జరిగిన నేను ప్రపంచకప్‌లో ఆడతా. అద్భుతాలు జరుగుతాయని నేను నమ్ముతున్నాను. జట్టులో ఇప్పటికే ఫాస్ట్ బౌలర్ల మధ్య పోటీ నెలకొంది. అయినప్పటికీ నేను ప్రయత్నిస్తా. నా ప్రతిభ ద్వారా నేను జట్టులో స్థానం దక్కించుకోగలనని భావిస్తున్నా అని తెలిపాడు. ప్రస్తుతం నా వయసు 34 ఏళ్లు. సచిన్, యూనిస్ ఖాన్, మిస్బా ఉల్ హక్ 40ఏళ్లు దగ్గరి వరకు క్రికెట్ ఆడారు. వారిని స్ఫూర్తిగా తీసుకుంటా. సుమారు నాలుగేళ్ల పాటు క్రికెట్‌కి దూరంగా గడిపా. పూర్తి ఫిట్‌నెస్ సాధించి తెల్ల రంగు జెర్సీ ధరించి టెస్టు క్రికెట్ ఆడాలని ఉంది. నా మొదటి లక్ష్యం కేరళ జట్టు తరఫున రంజీ క్రికెట్‌లో ఆడటం అని శ్రీశాంత్ చెప్పాడు.

## పారిశుధ్య నిర్వహణపట్ల శ్రద్ధ వహించండి



విశాఖపట్నం: పారిశుధ్యం నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ ఆదేశించారు. నాలుగవ జోన్ 48 మరియు 49 వార్డులకు చెందిన ప్రకాష్‌నగర్, ప్రకాష్‌నగర్ మెయిన్ రోడ్, జాలారి పేటలలో మంగళవారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులపై చెత్త పేరుకు పోయి ఉండడం, డ్రెయిన్లలో చెత్తను పరిశీలించిన కమిషనర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సత్యనారాయణలను అపారిశుధ్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ మార్జిన్లను శుభ్రం చేయకపోవడం, డంపర్ బిన్లను తొలగించకపోవడం, బిన్ల క్రింద, ప్రక్కన పరిశుభ్రపరచకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటింటి నుండి చెత్త సేకరణ కార్యక్రమానికి ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి ప్రతీకగా అభివర్ణించారు. కాలువల లో చెత్తను తొలగించి మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని తద్వారా దోమల వ్యాప్తి అరికట్టవచ్చునని అభిప్రాయపడ్డారు. అవసరమైన చోట సి.సి రోడ్లను నిర్మించాలని, డ్రెయిన్లకు మరమ్మత్తులు నిర్వహించడానికి ప్రతిపాదనలు రూపొందించాలని యస్.ఇ శివరాం ప్రసాదరాజును, ఇ.ఇ వేణుగోపాలరావును ఆదేశించారు. త్రాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని స్దానికులు పేర్కొనగా సరఫరాకు లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని ఏ.ఇ ని పురమాయించారు. సులాభ్ కాంప్లెక్స్‌ను తనిఖీ చేశారు. పర్యటనలో జోనల్ కమిషనర్ ఎస్ రమణమూర్తి, ఏసిపి రాజేశ్వరరావు, ఏ.యం.ఓ.హెచ్ డా.మురళీ మోహన్ జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మీ అధ్యయనానికి అయ్యే ఖర్చు

# మేమందిస్తాం

### ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించండి

### వేద విద్యార్థులారా చక్కగా అభ్యసించండి

### రుషీకేష్ శాఖాభవనంలో శారదాపీఠాధిపతి ఆశీస్సులు



ఋషీకేష్: వేద విద్యార్థులారా మీరంతా చక్కగా చదివి ఉత్తమ విద్యార్థులుగా తయారు కావాలని, తద్వారా వేద ప్రచారానికి మీరంతా నడుంకట్టాలని ఋషీకేష్‌లోగల శారదాపీఠం శాఖాభవనంలో విద్యార్థులతో చర్చించి తెలుసుకున్నారు. ఋషీకేష్ విశాఖ శ్రీ శారదాపీఠం శాఖాభవనంలో చాతుర్మాస దీక్షలో ఉన్న షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ మహా స్వామి ఋషీకేష్‌లో ఉండే అనేక మంది నైష్ఠిక బ్రహ్మచారులకు శ్రీ శారదాపీఠం శాఖాభవనంలో షడ్‌శాస్త్రాలు (ఆరు శాస్త్రాలు) చదువుకుంటున్న వేద విద్యార్థులకు బండారా నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులతో అనేక విషయాలపై చర్చించి ప్రతీ ఒక్కరినీ ఏఏ శాస్త్రాలు అధ్యయనం చేస్తున్నారనే విషయం అడిగి తెలుసుకున్నారు. వారంతా పూర్వ మీమాంశ, ఉత్తర మీమాంస, సాంఖ్యదర్శనం, యోగదర్శనం, న్యాయదర్శనం, వైశేషిక దర్శనం మొదలగు శాస్త్రాలు అధ్యయనం చేస్తున్నట్లు స్వామీజీకి తెలిపారు. అందుకు స్వామీజి ఎంతో ఆనందించి మీరంతా శ్రద్ధాభక్తులతో శాస్త్రాధ్యయనం చేయాలని హితవు పలుకుతూ మీ అధ్యయనాలకు అయ్యే ఖర్చంతా మేమందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ శారదాపీఠం ఉత్తర పీఠాధిపతి బాలస్వామి మరియు ఇతర వేద విద్యార్థులు పాల్గొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com